www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు: 08 వెల : రూ.5.00

ప్రజానావ ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

published from : Karimnagar, circulated to : Hyderabad, Karim nagar, Warangal, Khammam, Nalgonda, Mahabub nagar | హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 155 | శుక్రవారం | 15.11.2024



## రేవంత్.. అరెస్ట్ చేసుకో

అక్రమ కేసులను ఎదుర్కొనే ధైర్యం నాకు ఉంది

- పోలీసులు సీఎం ప్రైవేట్ సైన్యంలా ప్రవర్తిస్తున్నారు
- లగచర్ల గ్రామస్థులకు న్యాయం జరిగే వరకూ ఊరుకోను
- బాధితులను ఢిల్లీ తీసుకెళ్లి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తా
- పట్నం నరేందర్‌రెడ్డి రిమాండ్ రిపోర్ట్ బోగస్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:**

లగచర్ల దాడి కేసులో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేంద్ రెడ్డి రిమాండ్ రిపోర్ట్ ఒక బోగస్ అని కోర్టు చెప్పిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పోలీసులు కిరాతంగా వ్యవహరిస్తున్నారని.. సీఎం రేవంత్ రెడ్డి ప్రవేట్ సైన్యం లాగ పరిస్థితి తయారైందని మండిపడ్డారు. రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలను ఉగ్రవాదులను అరెస్ట్ చేసినట్లు చేస్తున్నారని పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కేటీఆర్ మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లగచర్ల గ్రామస్థులకు న్యాయం జరిగే వరకు నేను ఊరుకోనని.. లగచర్ల మిగతా 2లో..

## విద్యార్థుల కలలను నిజం చేస్తాం

### రూ.5వేల కోట్లతో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తాం

- ఇటీవలే హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం
- బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు విద్యాశాఖకు కేటాయించాం
- విద్యపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని నిరూపించాం
- బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి
- ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన జాతీయ బాలల దినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:**

కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొని మాట్లాడారు. 'రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి బాలల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. జవహర్‌లాల్ నెహ్రూ భారత తొలి ప్రధానే కాదు.. దేశాన్ని ప్రపంచం ముందు గొప్పగా చూపించిన నేత. నవీన భారత రూపశిల్పి నెహ్రూ. రూ.5వేల కోట్లతో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తాం. ఇటీవలే హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం. రాష్ట్రంలో గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి. బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు విద్యాశాఖకు కేటాయించాం. ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలని పదోన్నతులు ఇచ్చాం, బదిలీలు మిగతా 2లో..

## మీరు అన్యాయం చేస్తుంటే.. వంత పాడాలా



- భూములు ఇవ్వబోమని రైతులు అంటుంటే మొండిగా వ్యవరిస్తున్నది మీరే
- రాష్ట్రంలో ఏం జరిగినా బీఆర్ఎస్ కుట్ర ఉందని ప్రచారం చేస్తున్నరు
- లగచర్ల దాడితో మా నేతకు, పార్టీకి ఏం సంబంధం?
- రేవంత్ పాలన అంతానికి ఇక కౌంట్ డౌన్ ప్రారంభం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

2

## 21 ఏళ్లు నిండితే.. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలి

- ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే 25 ఏళ్ల వయస్సు నిబంధన ఉంది
- 21 ఏళ్లు నిండిన వారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలి
- అప్పడే యువత రాజకీయాల్లోకి వస్తుంది
- చిల్డ్రన్ మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2



## ఫోన్ ట్యాపింగ్‌తో నాకు సంబంధం లేదు..

- విచారణకు హాజరై, పోలీసుల ప్రశ్నలకు సమాధానాలు
- మళ్లీ ఎప్పుడు పిలిచినా వస్తాను
- చిన్న విషయాన్నీ పెద్దగా చేయాలని చూస్తున్నారు
- బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

2




## మమ్మల్ని చంపినా భూములివ్వం

- మాకు దాడి చేయాలని ఎవరూ చెప్పలేదు
- మేం ఎవరి మీద దాడి చేయలే
- ఆ రోజు కలెక్టర్ వస్తున్న విషయం కూడా తెలీదు
- మీడియాతో లగచర్ల గ్రామస్తులు

2



## ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్ కుట్ర

- అమాయక ప్రజలను బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారు
- ఫార్మా క్లస్టర్లను విస్తరించే పనిని వ్యతిరేకించడం సరికాదు
- ప్రభుత్వ వైఫల్యమేంటో కేటీఆర్ చెప్పాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



## రేవంత్ రెడ్డిది మిడిమిడి జ్ఞానం

- గవర్నర్ నిర్ణయానికి ముందు లీగల్ ఒపీనియన్ ఉంటుంది
- జాప్యం జరగడంతో తొందరపాటు వ్యాఖ్యలు సరికాదు
- బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అనడం అవివేకం
- బీజేపీకి కేసీఆర్, కేటీఆర్ సర్టిఫికెట్ అవసరం లేదు
- ప్రధాని మోదీ రాష్ట్రానికి వస్తే స్వాగతం పలకలేని మొఖాలు మీవి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. 'రాష్ట్ర గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా లీగల్ ఒపీనియన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొంత జాప్యం జరగడం సహజం. అంతమాత్రానికే తొందరపాటు వ్యాఖ్యలు చేయడం సరికాదు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని చెప్పడం అవివేకం'అని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. గురువారం భారత్ మండపంలో ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫేర్- 2024లో కేంద్ర గనుల శాఖ, కోలిండియా పెవిలియన్‌లను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు పెవిలియన్‌లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ సంస్థల స్టాళ్లను కేంద్రమంత్రి సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అవినీతి మిగతా 2లో..

## కన్ఫెషన్ రిపోర్ట్ ఫేక్

- కేటీఆర్ గురించి పోలీసులకు నేనేమీ చెప్పలేదు
- పోలీసులు నా నుంచి స్టేట్‌మెంట్ తీసుకోలేదు
- జైలు నుంచి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి లేఖ
- కేసు కొట్టి వేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్
- ఆయనను 7 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరిన పోలీసులు
- విచారణ సోమవారానికి వాయిదా వేసిన వికారాబాద్ కోర్టు

2

## పంట భూములు ఫార్మా కంపెనీలకు ఇవ్వడం దారుణం

- పేదల భూములు లాక్కుని బహుళజాతి కంపెనీలకు కట్టబెడతారా?
- రైతుల నుంచి భూములను వేరుచేయడమంటే తల్లిని బిడ్డను వేరు చేయడమే
- ప్రజల భూములు, ఆస్తులు లాక్కునే ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదు
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



2

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

## రేవంత్.. అరెస్ట్ చేసుకో

(మొదటి పేజీ తరువాయి)

బాధితులను ఢిల్లీ తీసుకుపోయి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సంగతి తేలుస్తామన్నారు. నేను ఏం తప్పు చేయలేదని.. అందుకే నేను ఎవరికీ భయపడనని తేల్చిచెప్పారు. మళ్లీ సవాల్ చేస్తున్న.. ఈ రేస్ అయిన ఇంకేదైనా కేసులోనైనా అరెస్ట్ చేస్తే చేసుకోండన్నారు. అక్రమ కేసులను ఎదుర్కొనే ధైర్యం నాకు ఉందని.. ఇలాంటి వాళ్ళను చాలా మందిని చూశామన్నారు. రేవంత్ రెడ్డి సీఎం పోస్ట్‌లో ఇంకా ఎన్ని రోజులు ఉంటావో తెలియదు.. ముందు నీ సీఎం కుర్చీ కాపాడుకో అని ఎద్దేవా చేశారు. ఉత్తమ్, భట్టి నీ కుర్చీలో కూర్చుంటారని.. బాంబులు పేల్చేది నీ మీదనే.. మీ పార్టీలోనేనని కీలక వ్యాఖ్యలు చేశారు. మూసీ కోసం రేవంత్ రెడ్డి కొత్తగా చేసేదేమి లేదని.. కేవలం డబ్బు దండుకోవడం కోసమే మూసీ టాపిక్ ఎత్తుకున్నారని ఆరోపించారు. డీపీఆర్ లేకుండానే రూ. లక్ష 50 వేల కోట్ల అయితవని ఎలా చెప్పారని నిలదీశారు. మూసీ పేరుతో ఢిల్లీకి డబ్బులు పంపేందుకు ప్లాన్ చేశారని విమర్శలు గుప్పించారు.



## ఫోన్ ట్యాపింగ్‌తో నాకు సంబంధం లేదు

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విచారణకు హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పినట్లు పేర్కొన్నారు. 'ఈనెల 9న నాకు నోటీసులు ఇచ్చారు. చిన్న విషయాన్నీ పెద్దగా చూస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో తనకు సంబంధం లేదు. కేసులో ఇద్దరు వ్యక్తుల నంబర్లు కావాలన్నారు. ప్రచార సమయంలో అదనపు ఎస్పీ (సస్పెండెడ్) తిరుపతన్నతో మాట్లాడిన మాట వాస్తవం. మదన్‌రెడ్డి, రాజు నంబర్లు అడిగారు.. నేను బిజీగా ఉండటం వల్ల నా పక్కన ఉన్నవాళ్లు మెసేజ్ పెట్టారు. అంతేకానీ ట్యాపింగ్‌తో నాకు సంబంధం లేదు. పోలీసులు వాళ్ల దగ్గర ఉన్న ఆధారాలతో నన్ను పిలిచి విచారించారు.. నేను సమాధానం చెప్పాను. విచారణకు ఎప్పుడు పిలిచినా వస్తాను.' అని చిరుమర్తి లింగయ్య తెలిపారు.

# విద్యార్థుల కలలను నిజం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చేశాం. 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. టీచర్ పోస్టుల భర్తీ ద్వారా విద్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని నిరూపించాం' అని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు.

**పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించడానికి ఇష్టపడట్లేదు...**

'ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వర్సిటీలకు ఉపకులపతులను నియమించాం. విద్యా వ్యవస్థను బాగు చేసేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ టీచర్లకు ఉన్న అర్హత ప్రైవేటు ఉపాధ్యాయులకు లేదు. అయినా పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించడానికి ఇష్టపడట్లేదు. ప్రభుత్వ బడుల ప్రతిష్ట పెంచే బాధ్యత టీచర్లదే. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విద్యార్థులను కలిసి సమస్యలు తెలుసుకోవాలి. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 7 వరకు విజయోత్సవాలు నిర్వహిస్తున్నాం. అనుకున్న విధంగా బాలల దినోత్సవం రోజున ఉత్సవాలు ప్రారంభించాం.

**నాణ్యమైన భోజనం పెట్టకపోతే జైలుకు పంపుతాం..**

అధికారులు జిల్లాల్లో రెండు రోజుల పాటు పాఠశాలలను పర్యవేక్షించాలి. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలి. హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి అన్నం పెట్టాలి. దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకునేది లేదు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే జైలుకు పంపుతాం. గత సీఎంను ఏనాడైనా మీరు (విద్యార్థులను ఉద్దేశించి) చూశారా? మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను ఏనాడైనా చూశారా? ఈ రోజు మీ రేవంత్ అన్న మీతో చేయి కలిపాడా.. లేదా? దేశానికి ఆదర్శంగా ఉంటామని.. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాబోమని విద్యార్థులు ప్రమాణం చేయాలి'' అని సీఎం కోరారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



# పంట భూములు ఫార్మా కంపెనీలకు ఇవ్వడం దారుణం

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :**

పంటలు పండే భూములను ఫార్మా కంపెనీల కోసం రైతుల వద్ద నుంచి బెదిరించి తీసుకుంటున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. రైతుల నుంచి భూములను వేరు చేయడం అంటే తల్లిని బిడ్డను వేరు చేయడం వంటిదన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కంచే చేను మేసిన చందంగా ప్రజల భూములు లాక్కుని బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టే అధికారం ప్రభుత్వానికి ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే కొడంగల్‌లో భూములు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎటువంటి అర్హతలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు లగచర్లకు వెళ్తే అహ్వానం పలికిన పోలీసులు బీజేపీ ఎంపీ డీకే అరుణ వెళితే అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. దందాల కోసమే హైడ్రాను సృష్టించారని, ప్రజల భూములు, ఆస్తులు లాక్కునే ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఒప్పుకోకపోయినా అనేక ప్రలోభాలకు గురి చేస్తున్నారని తెలిపారు. తనపై దాడి జరగలేదని స్వయంగా కలెక్టరే చెప్పిన తర్వాత కూడా రాత్రికి రాత్రి 1500 పోలీసు బలగాలను మోహరించి గ్రామాల మీదపడి ప్రజలను అరెస్టులు చేశారని, ఎందుకు అరెస్టులు చేస్తున్నారని అడిగిన పాపానికి కొట్టారని మండిపడ్డారు. ఇంటర్నెట్‌ను బంద్ చేసి అరెస్టులు చేశారని, ఓట్లేసినందుకు రేవంత్ రెడ్డి చూపిస్తున్న నిజస్వరూపమే ఇది అన్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలో భూములు ఉన్నవారు తమ భూమి విలువ రూ.20 కోట్లు నుంచి రూ.30 కోట్లకు పెరిగిందని సంతోష పడుతుంటే భూములు కోల్పోయిన వారు మాత్రం అదే ఎయిర్ పోర్టులో టాయిలెట్లు క్లీనింగ్ చేసుకునే దుస్థితి నెలకొందని అన్నారు. భూములు ఇస్తే ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఊడ్చే ఉద్యోగాలు, తూడ్చే ఉద్యోగాలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్‌లో పోలేపల్లె సెజ్ విషయంలో ఇప్పటికే ఆందోళనలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. అధికారులను కూడా చెబుతున్నారని అన్నారు. గతంలో వైఎస్సార్, నిన్నటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వాలలో ఏం జరిగిందో చూశామని అన్నారు. ప్రభుత్వ పెద్దలను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తే తప్పకుండా శిక్ష తప్పదన్నారు. గత ప్రభుత్వంలో భూసేకరణకు వస్తే తన్నితరమండని దుర్మార్గంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి ఇవాళ మేము వెళ్తుంటే ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు.



# రేవంత్ రెడ్డిది మిడిమిడి జ్ఞానం

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడ జరిగినా నిష్పక్షపాతంగా విచారణ జరపాలన్నదే తమ డిమాండ్ అని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తాము హైకోర్టుకు వెళ్లామని, ఈ వ్యవహారాన్ని కూడా సీబీఐకి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విచారణ సరిగ్గా జరిగితేనే తప్పు ఎవరు చేశారో ప్రజలకు అర్ధమవుతుంది కదా అని చెప్పారు. కేంద్ర మంత్రులు ఏం చేయాలి? ఏం చేస్తున్నారనే విషయంలో.. కేటీఆర్, కేసీఆర్ ఇచ్చే సర్టిఫికెట్లు మాకు అవసరం లేదని స్పష్టం చేశారు. అనవసరంగా ఒకరిపైఒకరు బురదజల్లుకునే ప్రయత్నంలో బీజేపీ గురించి అసత్యాలు మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ మీద జరిగిన దాడి ఘటనను ఖండిస్తున్నామన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో జరిగిన ఘటనపై ఆయన ప్రజలతో మాట్లాడాలి.. అంతే తప్ప ఈ విషయంలో రాజకీయ ప్రయోజనం ఆశించడం సరికాదని సూచించారు. మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రాబోతుందని.. ఇందులో సందేహం అక్కర్లేదని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. త్వరలో ఆఫ్‌షోర్‌పై 10 బ్లాకుల వేలం: సముద్రాల్లో ఉన్న మినలర్స్‌ను సద్వినియోగం చేసుకునేందుకు ఆఫ్‌షోర్ మైనింగ్‌పైనా ప్రత్యేకంగా దృష్టి సారించామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఆఫ్‌షోర్‌పై 10 బ్లాకుల వేలానికి అంతా సిద్ధమైందని, రెండుమూడు నెలల్లో ఈ బ్లాకులను వేలం వేస్తామని చెప్పారు. ఇప్పటికే అర్జెంటీనాలో పలు బ్లాక్‌లను వేలంలో దక్కించుకున్నామని, అక్కడ తవ్వకాల పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. భారతదేశం బొగ్గు, గనుల రంగంలో సాధిస్తున్న ప్రగతి, ఆధునిక సాంకేతికత వినియోగం, కా ర్మికుల భద్రత, సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచర ణ తదితర అంశాలను భారత్‌మండపంలో ప్రారంభించిన పెవిలియన్ ద్వారా సందర్శకులకు వివరిస్తున్నామన్నారు.

ప్రధాని మోదీ నేతృత్వంలో బొగ్గు రంగంలో భారతదేశం ఆత్మనిర్భరత సాధించే దిశగా ముందుకెళ్తోందని వివరించారు. ప్రపంచంలోనే కోలిండియా మూడో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ అని, అలాంటి ప్రతిష్టాత్మక సంస్థ.. ఈ ఏడాది స్వర్ణోత్సవాలు జరుపుకుంటోందన్నా రు. సంవత్సరంపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని కిషన్‌రెడ్డి తెలిపారు.

# కన్ఫెషన్ రిపోర్ట్ ఫేక్

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :**

వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, జిల్లా అధికారులపై దాడి ఘటనలో తన ప్రమేయం లేదని, రాజకీయ ప్రేరేపణతో తనపై కేసు నమోదు చేశారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురు వారం ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆధారాలు లేకుండా తనపై నమోదు చేసిన కేసును, వికారాబాద్ జిల్లా కొడంగల్ కోర్టు ఇచ్చిన రిమాండ్ ఆదేశాలను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. 'బొమ్రాస్‌పేట్ స్టేషన్‌లో నమోదైన కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదు. కేవలం నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగానే నన్ను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టుకు కనీసం కారణాలను వెల్లడించలేదు. న్యాయవాదితో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదు. పోలీసులు తూతూ మంత్రంగా దాఖలు చేసిన రిమాండ్ డైరీని ట్రయల్ కోర్టు ఆమోదించి ఉత్తర్వులు జారీ చేసింది. టీఐఐసీ కోసం భూమి కోల్పోయే బాధితులే అధికారులపై దాడి చేశారు. ఎలాంటి సాక్ష్యాలు లేకుండా, దురుద్దేశంతో, రాజకీయ కారణాలతో నమోదు చేసిన కేసులో విధించిన రిమాండ్‌ను రద్దు చేయాలి..'అని నరేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్ ఈనెల 18న విచారణకు వచ్చే అవకాశం ఉంది.





ATTESTED
DEPONENT

**పోలీసులు కట్టుకథ అల్లారు...**

కలెక్టర్, జిల్లా అధికారులపై దాడి ఘటనలో తన పాత్ర ఉందంటూ పోలీసులు కట్టు కథ అల్లారని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆదేశాలతో రైతులను దాడులకు పురికొల్పినట్లుగా తాను నేరాంగీకార ప్రకటన ఇచ్చానని పోలీసులు చెబుతున్నట్లు తెలిసిందన్నారు. చర్లపల్లి జైల్లో ఉన్న నరేందర్‌రెడ్డి.. ఈ మేరకు గురువారం తన న్యాయవాదుల ద్వారా కొడంగల్ కోర్టును ఉద్దేశించి అఫిడవిట్ పంపించారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న తనను పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బలవంతంగా వికారాబాద్ పోలీసు శిక్షణ కేంద్రానికి తీసుకెళ్లి నిర్బంధించినట్లు తెలిపారు. ఆ తర్వాత పరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం కొన్ని కాగితాలపై సంతకాలు తీసుకుని కోర్టుకు తీసుకెళ్లారన్నారు. కోర్టులో ప్రవేశ పెట్టిన తర్వాత లగచర్ల ఘటనలో తాను ప్రథమ ముద్దాయిగా ఉన్నట్లు సమాచారం ఇచ్చినట్లు వివరించారు. తన అరెస్టు విషయంలో పోలీసులు చట్ట విరుద్ధంగా వ్యవహరించారని, అరెస్టు సమాచారాన్ని కనీసం తనకు కానీ, తన కుటుంబానికి కానీ ఇవ్వలేదని తెలిపారు. తాను అఫిడవిట్‌లో పేర్కొన్న వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని సరైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

**బెయిల్ కోసం జిల్లా కోర్టులో పిటిషన్...**

లగచర్ల ఘటనలో అరెస్టు అయిన తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నరేందర్‌రెడ్డి గురువారం వికారాబాద్ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నరేందర్‌రెడ్డి తరఫున బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు పిటిషన్ వేశారు. దీనిపై ఈ నెల 18న విచారణ జరుగుతుందని న్యాయవాది శుభప్రద్ పటేల్ తెలిపారు.

## 21 ఏళ్లు నిండితే.. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలి

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :**

చిల్డ్రన్ మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి సమావేశాలు సమాజానికి చాలా అవసరం.. శాసన సభలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలు, సమాధానాలు.. ఇతర అంశాలను విద్యార్థులు గమనించాలని తెలిపారు. విపక్షాలు ప్రశ్నించడం, ప్రభుత్వాన్ని నిలదీయడం వారి బాధ్యత.. లీడర్ ఆఫ్ ది హౌస్, లీడర్ ఆఫ్ ది అపొజిషన్ ఇద్దరికీ సమాన అవకాశాలు ఉంటాయి.. సభను సమర్ధవంతంగా నడిపే బాధ్యత స్పీకర్ పై ఉంటుంది.. విపక్షాలు ఆందోళన చేసినా ప్రభుత్వం సమన్వయంతో సభను నడిపించేలా చూడాలని ఆయన చెప్పుకొచ్చారు. కానీ దురదృష్టవశాత్తు ఈ రోజుల్లో కొందరు సభను ఎలా వాయిదా వేయాలానే విధంగా చేస్తున్నారు అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఇక, జవహర్ లాల్ నెహ్రూ ఎడ్యుకేషన్, అగ్రికల్చర్ రెవల్యూషన్ తీసుకొచ్చారు అని ముఖ్యమంత్రి రేవంత్ చెప్పారు. వారి వల్లే మనకు సమాజంలో ఇవాళ అవకాశాలు వచ్చాయి.. దేశంలో నిర్బంధ విద్య అమలు చేసేందుకు సోనియా గాంధీ, మన్మోహన్ ఎంతో సింగ్ కృషి చేశారు.. ఇక, 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కును అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీది.. ఎన్నికల్లో శాసన సభకు పోటీ చేసేందుకు 25 ఏళ్ల వయసు నిబంధన ఉంది.. 21 ఏళ్లు పూర్తి చేసుకున్న వారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తే.. యువత రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉంటుంది అని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## మీరు అన్యాయం చేస్తుంటే.. వంత పాడాలా

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :**

రాష్ట్రంలో ఏం జరిగినా బీఆర్ఎస్ కుట్ర ఉందని ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని చర్లపల్లి జైలులో ములాఖత్ సమయంలో హరీశ్ బృందం భేటి అయ్యింది. పార్టీ అన్ని విధాల అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని పట్నంకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మీరు చేసే అక్రమాలకు చిడతలు వాయించాల్న అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. రేవంత్ పగ ప్రతీకారంతో పట్నంను కుట్రపూరితంగా నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేయించారని ఆరోపించారు. కొడంగల్ నుంచే ప్రజాపాలన మీద తిరుగుబాటు మొదలైందని.. ఈ అరెస్ట్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మీకు ఓటేస్తే మేలు జరుగుతుందనుకుంటే పాపానికి.. లగచర్ల గ్రామం భూములను గుంజుకోవడమే మీరు చేసే మేలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. ఎక్కడ ఏం జరిగినా బీఆర్ఎస్‌పై పెడుతున్నారన్నారు. నిరుద్యోగులు, రైతులు, పోలీసులు స్వచ్ఛందంగా ధర్నా చేస్తే అది బీఆర్ఎస్ చేయించిందని రేవంత్ అంటున్నారని.. రేవంత్ సొంత నియోజకవర్గంలో తమ భూముల కోసం గిరిజనులు పోరాటం చేస్తే అది కూడా బీఆర్ఎస్ చేసిందనే అంటున్నారన్నారు. ప్రజలకు అన్యాయం జరిగితే పోరాడడం ప్రతిపక్షాలుగా మా బాధ్యత అన్నారు. మమ్మల్ని అక్రమంగా కేసులు పెట్టాలనుకుంటున్నావేమో .. మాపై కోపం ఉంటే మమ్మల్ని అరెస్ట్ చేయండి.. కానీ అమాయక గిరిజన రైతులపై కేసులెలా పెడతారని సీఎంని ప్రశ్నించారు. వెంటనే గిరిజన రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా ..? ప్రజాస్వామ్యమెక్కడుంది అంటూ నిలదీశారు. మల్లన్నసాగర్‌లో రేవంత్ రెండురోజులు నిరసన చేస్తే మేం అడ్డుకున్నమా.. ? అని ప్రశ్నించారు. అర్ధరాత్రి మహిళల చాతిమీద కాళ్లు పెట్టి అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఈ ప్రజల తిరుగుబాటు ఆగదని.. రేవంత్‌ని గద్దె దించే దాకా నిద్రపోమన్నారు. తమ ప్రభుత్వంలో 14వేల ఎకరాలు ఫార్మాసిటీ కోసం సేకరించామని.. అక్కడెందుకు ఫార్మాసిటీ కట్టరని ప్రశ్నించారు. రేవంత్ పాలన అదానీ, తమ్ముళ్లు, అల్లుళ్ల కోసమేనని తేల్చి చెప్పారు.. రైతుల భూములను కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ దళిత, గిరిజనుల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. ఇక నరేందర్ రెడ్డికి ఈ కేసుతో ఏ సంబంధం లేదన్నారు. రిమాండ్ రిపోర్ట్‌లో ఏముందో తెలియదని.. మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచడానికి ఒక్క నిముషం ముందు ఒత్తిడి చేసి నరేందర్‌రెడ్డితో సంతకం చేయించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ప్రజా వ్యతిరేకత కొడంగల్ నుండే ప్రారంభమయ్యిందన్నారు. ఉద్యమాలు, కేసులు బీఆర్ఎస్ పార్టీకి కొత్త కాదన్నారు. అన్యాయంగా పేద ప్రజల భూములు లాక్కోవాలని చూస్తున్నారని విమర్శించారు. అక్రమంగా నరేందర్ రెడ్డిని అరెస్టు చేసినా, అక్రమ కేసులు పెట్టినా ప్రజల తిరుగుబాటు కొడంగల్ నుండే ప్రారంభమయ్యింది అన్నారు.

## ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్ కుట్ర

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :**

బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్ర పోషించకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడంపైనే దృష్టి పెట్టిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేంటో చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన గురువారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'సమీకృత గురుకుల పాఠశాలలు పెట్టడం, రైతులకు రుణమాఫీ చేయడం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం, ప్రజలకు మంచి చేయడం ప్రభుత్వ వైఫల్యమా?' అని నిలదీశారు. అమాయక ప్రజలను బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఫార్మా క్లస్టర్లను విస్తరించే పనిని వ్యతిరేకించడం సరికాదన్నారు. కక్షపూరిత రాజకీయాలకు తాము వ్యతిరేకమని భట్టి స్పష్టం చేశారు. కులగణన చేస్తామని మాటిచ్చామని, దాన్ని ఆచరణలో చూపిస్తున్నామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి కులగణన ఎంతో ఉపయోగపడుతుందని, ఇది ఒక విప్లవాత్మక నిర్ణయమని చెప్పారు. ఈ విషయంలో దేశానికి తెలంగాణ ఆదర్శం కాబోతోందని భట్టి పేర్కొన్నారు.

## తెలంగాణ గ్రూప్–4 ఫలితాలు విడుదల

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :**

గ్రూప్-4 తుది ఫలితాలు విడుదల అయ్యాయి. గ్రూప్-4కు ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజినల్ లిస్ట్‌ను గురువారం (నవంబర్ 14) సాయంత్రం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) విడుదల చేసింది. అభ్యర్థులు పూర్తి వివరాల కోసం టీజీపీఎస్సీ అధికారిక https://www.tspsc.gov.in/ వెబ్ సైట్‌ను సందర్శించాలని.. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని కమిషన్ అభ్యర్థులకు సూచించింది. కాగా, 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం 2022 డిసెంబర్ 1వ తేదీన టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం 9,51,321 మంది అభ్యర్థులు గ్రూప్-4 పరీక్షకు దరఖాస్తులు చేసుకున్నారు. 2023 జూలై 1వ తేదీన టీజీపీఎస్సీ గ్రూప్ 4 పరీక్షను నిర్వహించింది. రిటన్ టెస్ట్‌లో క్వాలిఫై అభ్యర్థులను ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు ఎంపిక చేసింది టీజీపీఎస్సీ. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం 8,084 మంది అభ్యర్థులను గ్రూప్- 4 ఉద్యోగానికి ఎంపిక చేసింది. ఈ మేరకు గ్రూప్-4 ఉద్యోగానికి సెలెక్టైన అభ్యర్థుల ప్రొవిజనల్ లిస్ట్ గురువారం టీజీపీఎస్సీ రిలీజ్ చేసింది. 8,180 పోస్టులకు నోటిఫికేషన్ రిలీజ్ చేయగా.. ఇప్పుడు 8,084 ఉద్యోగాలకు మాత్రమే అభ్యర్థులను సెలెక్ట్ చేశారు. మరో 96 పోస్టులను భర్తీ చేయకుండా పెండింగ్‌లో పెట్టింది టీజీపీఎస్సీ.

## మమ్మల్ని చంపినా భూములివ్వం

**ప్రజానావ, ఖైరతాబాద్:**

పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తున్నా తాము మాత్రం భూములిచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. మేం ఓటేసి గెలిపిస్తే సీఎం అయిన రేవంత్‌రెడ్డి వచ్చి మమ్మల్ని చంపేసినా భూములివ్వబోమని రైతులు ఖరాఖండిగా చెబుతున్నారు. లగచర్ల ఘటన అనంతరం దాడి చేసిన వారి కోసం అర్ధరాత్రి సమయంలో గాలింపు చేపట్టిన పోలీసులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. కరెంట్ సరఫరా నిలిపివేసి, ఇంటర్నెట్ సేవలను బంద్ చేసి ఇల్లిల్లూ జల్లెడపట్టారు. చిన్నారులు, మహిళలు అని చూడకుండా అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత ఇండ్లలోకి వెళ్లిన పోలీసులు ఎవరూ లేరని మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా దౌర్జన్యంగా వ్యవహరించారు. అధికారులకు ఎదురుతిరిగిన ఘటనలో పాల్గొన్న రైతులు గ్రామంలో లేకపోయినా ఇండ్లలో సోదాలు చేసిన పోలీసులు మహిళలు, చిన్నారుల పట్ల దురుసుగా ప్ర వర్తించడంపై రైతు కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తాతల కాలం నుంచి భూములపై ఆధారపడి జీవిస్తున్నామని.. ఇప్పుడు కంపెనీల కోసం భూములిచ్చి తాము ఎలా బతకాలని రైతులు నిలదీస్తున్నారు. ఫార్మా విలేజ్‌కు భూములిచ్చే ప్రసక్తే లేదని, మమ్మల్ని చంపి భూములను తీసుకోండని తెగేసి చెబుతున్నారు. తమ భూములను లాక్కుంటే ఎంతకైనా తెగిస్తా మని స్పష్టం చేస్తున్నారు. రైతుల మనోవ్యథను గుర్తించి పునరాలోచించాలని, ఇంకా పోలీసులతో భయపెట్టాలని చూడొద్దని రైతులు తాము ఓటేసి గెలిపించుకున్న సీఎంను డిమాండ్ చేస్తున్నారు. హకీంపేట, పోలేపల్లి, లగచర్లతోపాటు తండాల రైతులందరం కలిసి తమ బతుకులు ఆగమవుతాయని గత పది నెలలుగా అన్ని పనులు వదులుకొని ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూనే ఉన్నాం. తాతల కాలం నుంచి ఈ భూములే మమ్మల్ని బతికిస్తున్నాయి. ఈ భూములను సర్కారు తీసుకుంటే మా బతుకులు ఆగమవుతాయి. వలస వెళ్లాల్సిన దుస్థితి వస్తుందని ప్రభుత్వానికి మరోసారి స్పష్టం చేస్తున్నాం. మరోవైపు లగచర్ల ఘటన అనంతరం ఫార్మా విలేజ్ ఏర్పాటుపై ప్రభుత్వం వెనుకడుగు వేస్తుందని భూములు కోల్పోతున్న గ్రామాలు, తండాల రైతులు భావించినా.. ప్రభుత్వం మాత్రం ఫార్మా విలేజ్ ఏర్పాటు దిశగా ముందుకే వెళ్తున్నది. పుట్టినప్పటి నుంచి ఈ భూమిని నమ్ముకునే బతుకుతున్నా. చదువులేదు, ఉద్యోగం చేయలేను. గిప్పుడు ఈ ఫార్మా కంపెనీలతో మా భూములు పోతాయని అంటుండ్రు. అవే పోతే మా బతుకులు ఎట్లా.. ఏం చేసుకొని బతకాలి. ఎక్కడ పోయి బతకాలి. అందుకే భూములివ్వం. మాలాంటి చిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి.. రోడ్డున పడేస్తే.. ఎట్లా..? మా పొలాలు మాకు కావాలి.. నోటికాడి కూడు లాక్కోవద్దు.



## 20 లోపు వివిధ పారా మెడికల్ కోర్స్ దరఖాస్తులు సమర్పించాలి

**ప్రజానావ, సిరిసిల్ల:**

డి.ఏ.ఎన్.ఎస్ (డిప్లమా ఇన్ అనస్థీషియా టెక్నికల్ కోర్స్) , డి.ఈ.సి.జి (డిప్లమా ఇన్ ఈసిజి టెక్నీషియన్ కోర్స్) చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు నవంబర్ 20 లోపు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో డి.ఏ.ఎన్.ఎస్ కోర్సు కు సంబంధించి 30 సీట్లు, డి.ఈ.సి.జి. కోర్సు కు 30 సీట్లు ఉన్నాయని, ఇప్పటివరకు రెండు కోర్సులకు కలిపి మొత్తం 57 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రెండు సంవత్సరాల డిప్లమా కోర్సులు చేసేందుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. డిప్లొమా కోర్సులకు సంవత్సరం 6000 రూపాయల ట్యూషన్ ఫీ ఉంటుందని, దీనిని ఈ పాస్ ద్వారా రియంబర్స్ చేయడం జరుగుతుందని అన్నారు. సీట్ల కేటాయింపు సమయంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తామని, ఈ కోర్సులలో నమోదు చేసుకునేందుకు పారామెడికల్ బోర్డు నవంబర్ 20 వరకు గడువు విధించిందని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆఫ్ ప్రకటనలు పేర్కొన్నారు.

## రాజన్న ఆలయంలో వైభవంగా సాంస్కృతిక కార్యక్రమాలు

**ప్రజానావ, వేములవాడ:**

కార్తీక మాసం పురస్కరించుకొని సామూహిక కార్తీక దీపోత్సవం సందర్భంగా గురువారం రాజన్న ఆలయ కళావేదిక ప్రాంగణంలో ఆలయ ఏ ఈ ఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్ జ్యోతిప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రాంభించారు. ఈ నేపథ్యంలో స్థానిక రాజన్న ఆలయ భజన బృందం వెంపటి సంతోష్,ఎం.మోగిలి, పి సత్యనారాయణ, ఎస్ రాజమల్లు చే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**సామూహిక కార్తీక దీపోత్సవం**

రాజన్న ఆలయంలోసామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమంనుసుహాసినీలచే సాయంత్రం 6:00 గంటల నుంచి రాత్రి 8:00 గంటల వరకు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అర్చక దుమాల నాగరాజు శర్మ , కట్కూరి వెంకటయ్యమరియు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



### వేములవాడ ఆలయాన్ని అత్యంత ప్రాధాన్యతతో

# అభివృద్ధి చేయాలి

**ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో:**

చారిత్రాత్మకమైన వేములవాడ ఆలయాన్ని భవిష్యత్తు తరాల కోసం పరిరక్షించే మరియు అభివృద్ధి చేసే ప్రయత్నంలో, తెలంగాణ దేవాదాయ, అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి. హైదరాబాద్‌లోని సచివాలయంలో కొండా సురేఖ నేతృత్వంలో గురువారం విస్తృత సమీక్షా సమావేశం జరిగింది. సమీక్షా సమావేశంలో బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తదితరులు పాల్గొన్నారు. రాబోయే 100 సంవత్సరాల పాటు ఆలయ సముదాయాన్ని దాని పవిత్రత మరియు నిర్మాణాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో పునరుద్ధరణ ప్రాముఖ్యతను మంత్రి కొండా సురేఖ నొక్కిచెప్పారు. సాంప్రదాయ ఆగమ శాస్త్రాల అభివృద్ధికి మరియు కట్టుబడి ఉండటానికి మధ్య సమతుల్యతను సాధించాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు. వివిధ మౌలిక సదుపాయాల మెరుగుదలలపై దృష్టి సారించి వివరణాత్మక మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సులభతరమైన ట్రాఫిక్ ప్రవాహాన్ని మరియు భక్తులకు మెరుగైన అనుభవాన్ని అందించడానికి ద్విచక్ర వాహనాలు మరియు నాలుగు చక్రాల వాహనాల కోసం పార్కింగ్ ప్రాంతాలను వేరు చేయడం ప్రధాన చర్యలు. ఆలయ అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం యొక్క విలువను గుర్తించిన మంత్రి సురేఖ, కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) కార్యక్రమాలు మరియు దాతృత్వ వ్యక్తుల నుండి విరాళాల ద్వారా నిధుల అవకాశాలను అన్వేషించాలని సూచించారు. సమగ్ర అభివృద్ధి ప్రాజెక్టుకు మద్దతుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అదనపు నిధులను అభ్యర్థించాలని ఆమె యోచిస్తున్నట్లు కూడా సూచించింది. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించేందుకు, భక్తులకు ప్రశాంతమైన వాతావరణాన్ని సృష్టించేందుకు, సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని మరియు భక్తి సంగీతాన్ని క్రమం తప్పకుండా ప్లే చేయాలని మంత్రి ప్రతిపాదించారు. సందర్శకులకు అంతరాయాలను తగ్గించడానికి జరుగుతున్న ఏదైనా అభివృద్ధి కార్యక్రమాలను జాగ్రత్తగా ప్లాన్ చేయాలని ఆమె పట్టుబట్టారు. వేద పాఠశాల స్థాపన, బిల్వ వనాన్ని విస్తరించాలని, ఈ రెండింటినీ ఆధ్యాత్మికంగా సుసంపన్నమైన నేపథ్యంలో నిర్మించాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. అదనంగా, పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా కొత్త ధర్మగుండ (పవిత్ర స్నానఘట్టం) కోసం ప్లాన్ చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదంతో విమాన గోపురానికి బంగారు తాపడం కోసం 16 కిలోల బంగారం, ₹ 6 కోట్ల నిధులతో కూడిన మహత్తర కార్యక్రమం త్వరలో చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే ఉన్న వెండి నిల్వలను స్థానిక దేవతల విగ్రహాల తయారీకి, ఆలయ ఆధ్యాత్మిక సమర్పణలను పెంచేందుకు వినియోగించేందుకు కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సమావేశంలో భూసేకరణ, సమగ్ర ప్రాజెక్టు ప్లానింగ్‌పై ఎండోమెంట్ అధికారుల నుంచి సమగ్ర నివేదికను మంత్రి కోరారు. ఈ సెషన్‌లో వేములవాడ మాస్టర్ ప్లాన్‌పై లోతైన ప్రదర్శన, ఆలయ మౌలిక సదుపాయాలు మరియు ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించే లక్ష్యంతో వివిధ ప్రతిపాదిత అభివృద్ధిని వివరిస్తుంది. ఎండోమెంట్ కమిషనర్ హనుమంతు, సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, అదనపు ఎండోమెంట్ కమిషనర్లు కృష్ణవేణి, జ్యోతి, వేములవాడ ఆలయ ఈఓ వినోద్, కంచి కామకోటి పీఠం సలహాదారు గోవింద హరి, స్థపతి ఎన్ నాయగన్, ప్రధాన అర్చకుడు ఉమేష్, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి తదితరులు ఉన్నారు. తీర్థయాత్ర అనుభవాన్ని సుసంపన్నం చేసేందుకు అవసరమైన ఆధునీకరణను చేపడుతూనే వేములవాడ ఆలయ ఆధ్యాత్మిక పవిత్రతను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు.



## జీవితంలో ఉన్నత స్థానాల్లో ఉండాలంటే విద్యతోనే సాధ్యం

- ధైర్యంగా మహిళలు,విద్యార్థినిలు ముందుకు వస్తేనే వేధింపుల నుంచి బయటపడతారు
- గంజాయి లాంటి మతుపదార్థాలకు దూరంగా ఉండాలి
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ప్రజానావ, సిరిసిల్ల:**

జీవితంలో ఉన్నత స్థానాల్లో ఉండాలంటే అది విద్య వల్లనే సాధ్యం అని, దానికోసం ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో, ప్రణాళికతో కష్టపడి చదవలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గురువారం యాంటీ డ్రగ్ క్లబ్స్ లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో మొదటి మూడు స్థానాలలో వచ్చిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రదానం చేసి విద్యార్థిని విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థిని,విద్యార్థులు జీవితంలో ఉన్నత విజయాలను చేరుకోవడానికి హార్డ్ వర్క్ యే ప్రధాన అస్త్రం అని,కష్టపడే తత్వమే విజయాల దరికి చేరుస్తుందన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా తము ఎంచుకున్న లక్ష్యం కోసం చేసే ప్రయత్నాలను మధ్యలో నిలిపివేయకుండ ఆత్మవిశ్వాసంతో క్రమశిక్షణతో,ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. యాంటీ డ్రగ్స్ క్లబ్స్ లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొవలన్నారు. మహిళలు,విద్యార్థినులు వేధింపుల నుండి బయట పడేందుకు ధైర్యంగా ముందుకు వెళ్ళడమే మార్గామని,విద్యార్థినిలు పోకిరీల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వేదింపులకు సంబందించి ఏదైనా చిన్న సంఘటన జరిగిన వెంటనే జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు ఫిర్యాదు చేస్తే వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు. జిల్లాలో మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన షీటీమ్ విద్యా సంస్థలు, బస్టాండ్ లు, మహిళలు పని చేసే ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో డ్రెస్ లలో నిరంతరం పోకిరీలపై నిఘా ఉంచుతూ పోకిరీల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తోందన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని, సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులు పంపే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అలాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి టెస్ట్ కిట్లు అందుబాటులో ఉన్నాయని దాని ద్వారా అనుమానిత వ్యక్తులపై, గతంలో గంజాయికి అలవాటు పడిన వారికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గంజాయికి సంబంధించిన సమాచారం పోలీస్ వారికి అందించాలని ఎస్పీ కోరారు. ఎస్పీ వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్.ఐ ప్రశాంత్ రెడ్డి, మోడల్ స్కూల్ అధ్యాపక బృదం విద్యార్థులు పాల్గొన్నారు.



# గ్రూప్–3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- పరీక్షల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి శిక్షణ
- ఉదయం 09.30 గంటల తరువాత అనుమతి లేదు
- మధ్యాహ్నం 02.30 గంటల తరువాత అనుమతి లేదు
- మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు

**ప్రజానావ, సిరిసిల్ల:**

ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లాలోని అన్ని కేంద్రాల్లో గ్రూప్ 3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. గ్రూప్ 3 పరీక్షల నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అబ్జర్వర్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, చీఫ్ సూపరిఇండెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ కు గురువారం శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీ పీఎస్సీ ఆదేశాల మేరకు జిల్లాలో 17112024 ఆదివారం ఉదయం 10.00 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 03.00 నుంచి 05.30 వరకు, 18112024 సోమవారం ఉదయం 10.00 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నమని తెలిపారు. పరీక్షకు మొత్తం 7062 మంది పరీక్షకు హాజరుకానున్నారని వెల్లడించారు. మహిళలు 3359, పురుషులు 3701, ట్రాజెండర్స్ 02 పరీక్షలు రాయనున్నారని వివరించారు.



**ప్రతి అభ్యర్థిని తప్పనిసరిగా తనిఖీ..**

పరీక్ష కేంద్రంలో అధికారులు నిర్వర్తించాల్సిన, నిర్వర్తించకకూడని విధులపై వివరించారు. ప్రతి అభ్యర్థిని తప్పనిసరిగా క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే కేంద్రంలోనికి అనుమతించాలని స్పష్టం చేశారు.

**అభ్యర్థుల బయోమెట్రిక్ అటెండెన్స్..**

అభ్యర్థులు బయో మెట్రిక్ అటెండెన్స్ తీసుకుంటారని, ముందుగానే కేంద్రానికి చేరుకుంటే సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రంలో సమయం తెలుసుకునేందుకు బెల్ ఉంటుందని స్పష్టం చేశారు.

**జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు..**

ఉదయం 09.30 గంటల తరువాత, మధ్యాహ్నం 02.30 గంటల తరువాత అభ్యర్థులకు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం సిరిసిల్ల నియోజకవర్గం లో 18 కేంద్రాలు, వేములవాడ నియోజకవర్గం లో 7 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఐదు ప్రభుత్వ పాఠశాలలు, ఏడు ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలాల్లో రెండు చొప్పున, అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల, అగ్రహారం డిగ్రీ కళాశాల, ఏడు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. మొత్తం అబ్జర్వర్స్ 25, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ 25 చీఫ్ సూపర్ఇండెంట్స్ 25, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ 05, దివ్యాంగుల కేంద్రాలు 02 ఉన్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు ఒక రోజు ముందు అన్ని పరీక్ష కేంద్రాల్లో గదులు, ఇతర ఏర్పాట్లు తనిఖీ చేయాలని సూచించారు.

**సమన్వయంతో పనిచేయాలి**

అన్ని పరీక్ష కేంద్రాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది మందులు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్ లు వేయాలని, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఆయా కేంద్రాల్లో పరిశుభ్రత పనులు, తాగు నీటి వసతి కల్పించాలని ఆదేశించారు. సెస్ అధికారులు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్**

అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద జీరాక్స్ సెంటర్లు మూసి ఉంచుతామని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి వచ్చే ప్రతి అధికారి, సిబ్బందికి ఐడీ కార్డు ఉంటుందని తెలిపారు. ఒక్కో కేంద్రానికి ఎస్ఐ నీ కేటాయించామని చెప్పారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ దీపాలు, ఫ్యాన్స్ ఉండేలా చూసుకోవాలని ఆర్ సీ ఓ కు సూచించారు.పరీక్ష మొదలైన తర్వాత ముగిసే వరకు ఎవరూ బయటికి వెళ్ళడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థి ఒక రోజు ముందే పరీక్ష కేంద్రాన్ని సరి చూసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు చంద్రయ్య, శేషాద్రిని రెడ్డి, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్సీఓ, జేఎన్టీయూ అగ్రహారం కళాశాల ప్రిన్సిపాల్స్ , జిల్లా అధికారులు, వేణుగోపాల్ పాల్గొన్నారు.



భారత మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 135వ జయంతి పురస్కరించుకొని పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ పార్క్ లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య, స్థానిక కౌన్సిల్ సభ్యులు వెల్దండి దేవదాస్, వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్ ,కౌన్సిల్ సభ్యులు దార్ణం అరుణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

-ప్రజానావ, సిరిసిల్ల

### ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో

## ఘనంగా బాలల దినోత్సవం




**ప్రజానావ, వేములవాడ :**

పిల్లలు దేశ భవిష్యత్తుని తీర్చిదిద్దేలాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా శిశు సంక్షేమ అధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు.వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులే ఉపాధ్యాయులుగా పాఠాలను బోధించారు. అనంతరం వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేయగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు వాటిని ఆయన అందించారు. ప్రతి వ్యక్తి అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, ఉపాధ్యాయులు మల్లేశం, రవీందర్, సలాం, అమీద్, శిరోమణి, రోజా తదితరు పాల్గొన్నారు.



### అన్నపూర్ణ వరి పంటతో

## అధిక దిగుబడులు

**ఎన్ఎస్ఎల్ కంపెనీ టీఎస్ఎల్ నర్సింహులు**

**ప్రజానావ, నారాయణపేట :**

నూజివీడు సీడ్స్ వారి అన్నపూర్ణ వరి పంటతో అధిక దిగుబడులు సాధించవచ్చని కంపెనీ ప్రతినిధులు అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా మాగనూరు మక్తల్ మండలం తాలంకేరి గ్రామానికి చెందిన రైతు తాశప్ప ఎకరా పొలంలో సాగు చేసిన అన్నపూర్ణ వరి పంటను ఎన్ఎస్ఎల్ కంపెనీ టీఎస్ఎల్ నర్సింహులు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నపూర్ణ వరి సాగు చేస్తే రైతులు అధిక దిగుబడులు సాధించి, లాభాలు పొందుతారన్నారు. ఈ రకం లక్షణాలు ఉన్న పంట అడ్డం పడదని, బీఎల్‌బీ తెగులును తట్టుకుంటుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# గేమ్స్ జోన్‌ను ప్రారంభించిన మెదక్ ఎంపీ రఘునందన్





**ప్రజానావ, మెదక్:**

మెదక్ జిల్లా కలెక్టరేట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పీఎం డ్రైవ్ ఇన్ జోన్‌ను మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రారంభించారు. అనంతరం మెదక్ మున్సిపల్ చైర్మన్ బౌలింగ్ వేయగా ఎంపీ రఘునందన్‌రావు క్రికెట్ ఆడారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ చిన్నప్పటి నుండి పిల్లలను తల్లి దండ్రులు పాఠశాలకు ఎంత సిన్సియర్ పంపుతారో.. అంతే సిన్సియర్‌గా ప్లే గ్రౌండ్ కూడా పిల్లలను గ్రౌండ్ పంపాలని కోరారు. ఈ మధ్య కాలంలో విద్యార్థులు క్లాస్ రూంలకు పరిమితం అవుతూ ఒబిసిటీ సమస్యతో బాధపడుతున్నారన్నారు. పాఠశాలలకు పర్మిషన్ తీసుకుని గ్రౌండ్ లేకుండా చిన్న చిన్న డబ్బాలలో తరగతులు నడుపుతున్నారని తెలిపారు. విద్యార్థులను పుస్తకాల పురుగుల మారుస్తున్న తరుణంలో ఇలాంటి క్రీడ జోన్ లు యువతకు, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. పుస్తకాల పురుగుల విద్యార్థులను మారుస్తున్న తరుణంలో ఇలాంటి క్రీడ జోన్ లు యువతకు స్టూడెంట్స్ ఉపయోగకరం అన్నారు. అభివృద్ధి లోకి రావాలి అనుకుంటున్న క్రీడాకారులకు మంచి పరిణామం అన్నారు. శారీరకంగా మానసికంగా క్రీడలు మనిషికి దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్ర పాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, కౌన్సిలర్స్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-3 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

### తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి



ప్రజానావ, తూప్రాన్ : ఈ నెల 17, 18న నిర్వహించే గ్రూప్-3 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి అన్నారు. తూప్రాన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్, శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలను పరీక్షా కేంద్రాలకు ఎంపిక చేశామన్నారు. ఒక్కో సెంటర్‌లో 288 మంది పరీక్ష రాయనున్నారు. రెండు సెంటర్‌లో కలిపి 576 మంది రాస్తున్నట్లు తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు నిర్ణీత సమయంలోపు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. రోజుకు రెండు పరీక్షలు చొప్పన ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండడంతో ప్రజలు గుంపులుగా ఉండకూడదన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు స్టేషనరీ కిట్స్ అందచేత



**ప్రజానావ, చిన్న శంకరంపేట:**

చిన్న శంకరంపేట మండలం చందాపూర్ ఖాజాపూర్ గ్రామాల్లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సానిక్ష ఫౌండేషన్, ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్, అహల్య స్వచ్ఛంద సంస్థ వారి సౌజన్యంతో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ కిట్‌స్‌తో పాటు, స్వెటర్లు అందజేశారు. అనంతరం సానిక్ష ఫౌండేషన్ అధ్యక్షులు శివ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ముందుకు వచ్చే విధంగా ప్రోత్సహిస్తూ అనేక రకాలుగా సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జంగారై సొసైటీ వైస్ చైర్మన్ కృష్ణ గౌడ్, పాఠశాల చైర్మన్ లావణ్య, డాక్టర్ మానేగల్ల భాస్కర్, యూత్ కోఆర్డినేటర్ స్వాతి, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, రాజకుమార్, మహేష్, ఫౌండేషన్ సభ్యులు శ్రీశైలం, విట్టల్, రమేష్, నవీన్, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి, శేఖర్, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి కృష్ణ



**ప్రజానావ, తూప్రాన్:**

సామాజిక ఆర్థిక విద్య, కుల, వైద్య, రాజకీయ, సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ అన్నారు. గురువారం తూప్రాన్ మున్సిపల్‌లోని 12వ వార్డులో సమగ్ర కుటుంబ సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను ఎలాంటి తప్పులు లేకుండా సక్రమంగా నిర్వహించాలని న్యూమరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో నర్సోజి, మల్లేష్, లింగం, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల దినోత్సవం

**ప్రజానావ, దౌల్తాబాద్:**

నేటి బాలలే రేపటి పౌరులని పాఠశాల తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మాణం అవుతుందని ఇందు ప్రియాల్ అంగన్‌వాడీ టీచర్ మహమ్మద్ సుల్తాన అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ అంగన్‌వాడీ 3వ కేంద్రంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం జాతీయ బాలల దినోత్సవంగా నిర్వహించామన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే ప్రతి ఒక్కరు జీవితంలో లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రణాళిక బద్ధంగా విద్యను అభ్యసించాలన్నారు. పాఠశాల తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మాణం అవుతుందని, అలాంటి పాఠశాలలో ఉపాధ్యాయుల చేత విద్యాభ్యాసం నేర్చుకుని తల్లిదండ్రులకు గ్రామానికి గొప్ప పేరు తీసుకురావాలన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో కత్తిపోటు తప్పిన కలం పోటు తప్పదని అటెండర్ స్థాయి నుంచి ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి వరకు వార్డు సభ్యులు స్థాయి నుంచి ప్రధాన మంత్రి, రాష్ట్రపతి స్థాయి వరకు ప్రతి ఒక్కరూ పాఠశాలలో ఉపాధ్యాయుల చేత విద్యను అభ్యసించాల్సిందేనన్నారు. కాబట్టి విద్యార్థులు అందరూ బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఆయా పెంటమ్మ, మహిళలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చేయూత

**ప్రజానావ, దౌల్తాబాద్:**

బాధిత కుటుంబానికి బీజేపీ దుబ్బాక నియోజకవర్గం మాన్ కీ బాత్ కన్వీనర్ ముత్యాల శ్రీనివాస్ బియ్యం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. గురువారం సూరంపల్లిలో బైండ్ల నర్సింహులు గత మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన బైండ్ల నర్సింహులు మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమని, ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు వారి కుటుంబాన్ని పరామర్శించి తమ వంతు సహకారంగా 50 కేజీల బియ్యాన్ని అందజేశామన్నారు. ఆంజనేయులు, సాయిలు, రాజేష్‌కుమార్, బాలకృష్ణ, శ్రీకాంత్, ఎల్లయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

## ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు



**ప్రజానావ, మెదక్:**

హవేలీ ఘనపూర్ మండలం కూచన్‌పల్లి గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జవహర్‌లాల్ నెహ్రూ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధు మోహన్ మాట్లాడుతూ నెహ్రూ భారతదేశానికి చేసిన సేవలు అమోఘం అని, నెహ్రూకు గులాబీ పువ్వు, పిల్లలు చాలా ఇష్టమన్నారు. ప్రతి విద్యార్థి తరగతి గదిలోనే విద్యను అభ్యసించి మంచి భవి భారత పౌరుడిగా ఎదగాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివరాజ్, సుకన్య, శ్రీనివాస్, మల్లారెడ్డి, నిర్వాహకులు శశికుమార్, సందీప్ కృష్ణ, భరత్, సంతోష్ కుమారి, గంగమణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



## తూప్రాన్ సీఐకి రివార్డు అందజేత

**ప్రజానావ, తూప్రాన్:**

ఉమ్మడి మండలంలో భారీ ఎత్తున గంజాయి పట్టుకోవడంలో కృషిచేసిన తూప్రాన్ సీఐ రంగా కృష్ణకు గురువారం జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి నగదు రివార్డును అందజేశారు. రెండు రోజులలో తూప్రాన్ మనోహర మండల కేంద్రాల్లో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని పట్టుకుని రిమాండ్ చేసినందుకు జిల్లా ఎస్పీ అభినందించారు. జిల్లా ఎస్పీ ఆఫీసులో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఏఎస్పీ మహేందర్‌రెడ్డి, సూపర్ డీఎస్పీ వెంకట్‌రెడ్డిలు ఆయనకు రివార్డును అందజేసి అభినందించారు. పోలీసు అధికారులు విధి నిర్వహణలో మంచిగా పని చేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

## నేటి బాలలే రేపటి పౌరులు

### అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు ప్రతిభ

**ప్రజానావ, దౌల్తాబాద్:**

నేటి బాలలే రేపటి పౌరులని పాఠశాల తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మాణం అవుతుందని దౌల్తాబాద్ అంగన్వాడీ ఉపాధ్యాయురాలు బ్యాగరి ప్రతిభ అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని 4వ అంగన్ వాడి కేంద్రంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ



భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం జాతీయ బాలల దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే ప్రతి ఒక్కరు జీవితంలో లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రణాళిక బద్ధంగా విద్యను అభ్యసించాలన్నారు. పాఠశాల తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మాణం అవుతుందని, అలాంటి పాఠశాలలో ఉపాధ్యాయుల చేత విద్యాభ్యాసం నేర్చుకుని తల్లి దండ్రులకు గ్రామానికి గొప్ప పేరు తీసుకురావాలన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో కత్తిపోటు తప్పిన కలం పోటు తప్పదని అటెండర్ స్థాయి నుంచి ఐఏఎస్,ఐపీఎస్ స్థాయి వరకు వార్డు సభ్యులు స్థాయి నుంచి ప్రధాన మంత్రి, రాష్ట్రపతి స్థాయి వరకు ప్రతి ఒక్కరూ పాఠశాలలో ఉపాధ్యాయుల చేత విద్యను అభ్యసించాల్సిందే అన్నారు. కాబట్టి విద్యార్థులు అందరూ బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఆయా లక్ష్మి మహిళలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సొసైటీ వారోత్సవాలు

**ప్రజానావ, చిన్న శంకరంపేట:**

ఈ నెల 14వ తేదీ నుండి 20 వరకు నిర్వహించే అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా చిన్న శంకరంపేట మండలం మదూర్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో 71వ వారోత్సవాలు పురస్కరించుకొని సొసైటీ కార్యాలయం ఎదుట సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సప్తవర్ణాల జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు అఖిలభారత సొసైటీ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, వారోత్సవాల్లో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సహకార సంఘాల అభివృద్ధి కోసం రైతులకు తక్కువ ధరకే ఎరువులు విక్రయించడం జరుగుతుందని, దీంతో అటు రైతులకు ఇటు సహకార సంఘాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో కృష్ణ, సొసైటీ వైస్ చైర్మన్ యాదగిరి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు

**ప్రజానావ, తూప్రాన్:**

తూప్రాన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఐడియల్ స్కూల్లో చిల్డ్రన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన డాన్సులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బీమరి సాయిసమర్, ఐడీయల్ స్కూల్ ప్రిన్సిపాల్ రజని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# అధికారులపై దాడిని ఉపేక్షించొద్దు

- నిందితులు ఎంత వారైనా కఠిన చర్యలు తీసుకోవాలి
- ఘటన వెనుక కుట్రదారులను శిక్షించాలి
- పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి డిమాండ్
- లగచర్ల ఘటనకు నిరసనగా హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ధర్నా







ప్రజానావ, ఖైరతాబాద్:

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో అధికారులపై జరిగిన దాడి ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల ఐకాస చైర్మన్ వి.లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక ఎవరున్నా, ఎంతవారైనా ఉపేక్షించొద్దని కోరారు. లగచర్ల ఘటనకు నిరసనగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ కలెక్టరేట్ ముందు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగుల ఐకాస చైర్మన్ వి.లచ్చిరెడ్డి హాజరయ్యారు.

**దాడి వెనుక దాగి ఉన్న కుట్రను బహిర్గతం చేయాలి**

ధర్నాను ఉద్దేశించి వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులపై దాడికి పాల్పడి, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కుట్రపన్నిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజల కోసం పని చేసే ప్రభుత్వ అధికారులను లక్ష్యంగా చేసుకొని దాడి చేయడంలో కుట్ర కోణం దాగి ఉంటుందని ఆరోపించారు. ఇప్పటికే పోలీసుల విచారణలో వెలుగులోకి వస్తున్న విషయాలు ఉద్యోగ లోకాన్ని భయభ్రాంతులకు గురి చేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా సేవలు అందించే అధికారులపై దాడులు, హత్యాయత్నం వంటి ఘటనలకు పూనుకోవడం వెనుకాల బలమైన కుట్ర దాగి ఉందనే అనుమానాలకు బలం చేకూరుతుందన్నారు.

తీవ్రంగా గాయపడిన ఏ అధికారిని ఎవరు పరామర్శించలేదన్నారు. చివరకు కొందరు అధికారులపై జరిగిన దాడిని సైతం పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. లగచర్ల ఘటనలో దాడికి గురైన ఉద్యోగులపై కాకుండా, దాడికి పాల్పడిన వారిని పరామర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం హైదరాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ నాయకులు కె.రామకృష్ణ , జనరల్ సెక్రటరీ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, ఎస్.రాములు , అధ్యక్షులు తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ , డా.జి.నిర్మల, అధ్యక్షులు తెలంగాణ ఉద్యోగుల అసోసియేషన్, దర్శన్‌గౌడ్ , అధ్యక్షులు తెలంగాణ సీపీయస్ యూనియన్ , సిహెచ్ రవి అధ్యక్షులు, టిడిఆర్ డి ఏ ఓ అసోసియేషన్, డా. కత్తి జనార్దన్, దేవికా , శ్రీరాం, హరికిషన్ , ఉదర గోపాల్ , విజయారావు, సుగంధిని, హేమలత, రాబర్ట్ బ్రూస్, రోహిత్ నాయక్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు క్రీడా వస్తువులు పంపిణీ

ప్రజానావ, శామీర్‌పేట:

బాలల దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తూముకుంట విద్యార్థిని విద్యార్థులకు బయాలజికల్ ఈ దాట్ల ఫౌండేషన్ వారు విద్యార్థులకు జాయ్ ఆఫ్ గివింగ్ అనే ప్రోగ్రాం కింద విద్యార్థులకు షటిల్ బ్యాట్స్, క్రికెట్ బ్యాట్స్, డిక్షనరీస్ వాలీబాల్, చెస్, క్యారమ్స్, 10వ తరగతి ఆల్ ఇన్ వన్ వంటి వివిధ వస్తువులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత కుమారి మాట్లాడుతూ భవిష్యత్తులో దాట్ల ఫౌండేషన్ వారి సహకారం మా విద్యార్థులకు ఇలాగే ఉండాలని కోరారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీ దేవాని, దాట్ల ఫౌండేషన్ వాలంటీర్స్ సౌమ్య, వైష్ణవిలను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తిరుమలేష్, అన్నపూర్ణ, నాగశారద, వనజ, శ్రీనివాస్ రెడ్డి, రజిని, వరలక్ష్మి, భాగ్యరేఖ మహేష్, శ్రీదేవి, మంజుల, రవి, అనూష, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## వన దుర్గమ్మ దర్శించుకున్న

# అఘోరి నాగసాధువు



ప్రజానావ, మెదక్:

పాపన్నపేట్ మండలం నాగసాన్‌పల్లి గ్రామం తెలంగాణ రాష్ట్రంలో అతి ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఏడుపాయల వన దుర్గామాతను అఘోరి సాధువు గురువారం దర్శించుకుని, వనదుర్గమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు, ఆలయ సిబ్బంది ప్రసాదాన్ని అందించారు. వారిని చూసేందుకు భక్తులు, దుకాణ సముదాయాల యజమానులు ఎంతో ఆసక్తిగా చూశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం దేవాలయాలను దర్శించుకుంటున్నానని తెలిపారు. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టడమే కాకుండా దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హిందువులందరూ కలిసికట్టుగా ఉండాలని సూచించారు. గో హత్యలను అరికట్టేందుకు ప్రతి హిందువు ముందుకు రావాలని సూచించారు.

# అక్షర పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం




ప్రజానావ, జగదేవపూర్:

జగదేవపూర్ మండల కేంద్రంలో గల అక్షర పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటాపాటలు పలువురిని ఆకర్షించాయి. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను యాజమాన్యం అందజేశారు. బాలల దినోత్సవం ప్రత్యేకతను విద్యార్థులకు తెలియజేశారు. మంచి చదువులు చదివి భవిష్యత్తులో రాణించాలని సూచించారు. అంతకు ముందు విద్యార్థులు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శివలింగం ఆకారంలో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రామస్వామి, ప్రిన్సిపాల్ సంతోషి, జ్యోతిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుదర్శన్, ఇన్‌చార్జి రేణుక, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మీ భవిష్యత్తు గురించి చదువుకోవాలి

## మెదక్ జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్

ప్రజానావ, చేగుంట:

జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకొని చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చందాయిపేటలో చావలి లక్ష్మి సుబ్రహ్మణ్యం పౌండేషన్ వారు ప్రతిభ గల విద్యార్థులకు రూ.64 వేలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన మెదక్ జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్ మాట్లాడుతూ లక్ష్మీ సుబ్రహ్మణ్యం ఫౌండేషన్ వారు ప్రతిభగల పిల్లలకు నగదు ద్వారా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదవాలని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విన్నప్పుడే భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉంటారన్నారు. ప్రభుత్వం విద్యార్థుల చదువుకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషన్, మండల విద్యాధికారి నీరజ, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు అమరేశ్వర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సంతోష, తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, ఉపాధ్యాయులు విఠల్‌రెడ్డి, అజిత, శ్రీనివాస్, సిద్దిరాములు, శంకర్, వీణ, యాదగిరి, బంగారయ్య, గిరిధర్, రాములు, దామోదర్ పాల్గొన్నారు.



# అన్నపూర్ణ వరి పంటతో అధిక దిగుబడులు

## ఎన్ఎస్ఎల్ కంపెనీ టీఎస్ఎల్ నర్సింహులు



ప్రజానావ, హైదరాబాద్:

నూజివీడు సీడ్స్ వారి అన్నపూర్ణ వరి పంటతో అధిక దిగుబడులు సాధించవచ్చని కంపెనీ ప్రతినిధులు అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా మాగనూరు మక్తల్ మండలం తాలంకేరి గ్రామానికి చెందిన రైతు తాశప్ప ఎకరా పొలంలో సాగు చేసిన అన్నపూర్ణ వరి పంటను ఎన్ఎస్ఎల్ కంపెనీ టీఎస్ఎల్ నర్సింహులు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నపూర్ణ వరి సాగు చేస్తే రైతులు అధిక దిగుబడులు సాధించి, లాభాలు పొందుతారన్నారు. ఈ రకం లక్షణాలు ఉన్న పంట అడ్డం పడదని, బీఎల్‌బీ తెగులును తట్టుకుంటుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సెరినిటి పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు



ప్రజానావ, కీసర:

భారత దేశం బంగారు భవిష్యత్తు నేటితరం బాలలని నాగారం సెరినిటి పాఠశాల ముఖ్య కార్యదర్శి నోముల వసంత కొనియాడారు. గురువారం పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నోముల వసంత మాట్లాడుతూ చాచా నెహ్రూ జన్మదినం బాలలకు పర్వదినం అని పేర్కొన్నారు. అనంతరం హై స్కూల్ విద్యార్థులు పోట్‌లక్ లంచ్ జరుపుకొన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, ఏవో వెంకట సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రెడ్డిలకే ఇవ్వాలి

ప్రజానావ, దౌల్తాబాద్:

దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రిజర్వేషన్ జనరల్ ఉన్నందున చైర్మన్ పదవి రెడ్డి వర్గానికి చెందిన నాయకులకు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు దశరథ్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి జనరల్ వచ్చిందని జనరల్ స్థానంలో వేరే వర్గాలకు అవకాశం కల్పించి జనరల్ వర్గాలకు చెందిన నాయకులను కించపర్చొద్దని రెడ్డి వర్గానికి చెందిన నాయకులకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో కర్నాల శ్రీనివాసరావు, బుచ్చిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

## శామీర్‌పేట సీఐ శ్రీనాథ్



ప్రజానావ, శామీర్‌పేట:

మోటార్ వాహనాల నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శామిర్ పేట పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనాథ్ వాహనాల యజమానులను హెచ్చరించారు. గురువారం శామిర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్సార్ చౌరస్తా, అలియాబాద్ చౌరస్తాలో సీఐ శ్రీనాథ్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4గంటల నుంచి 6గంటల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మొత్తం 56 ఆటోలు తనిఖీ చేశామని సరియైన పత్రాలు లేని 5వాహనాలతో పాటు మొత్తం 13 వాహనాలకు చలాన విధించామని తెలిపారు. అనంతరం వెహికిల్ నిబంధనలపై వాహనాల యజమానులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు హారిక, దశరథ, ఏ ఎస్ఐ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్ణోజీ బాలకృష్ణకు జాతీయస్థాయి అవార్డు



ప్రజానావ, శామీర్‌పేట:

విశ్వకర్మ నాలెడ్జి సెంటర్ వారి ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీ తెలంగాణ భవన్ లోని అంబేద్కర్ భవన్ లో గురువారం భారతదేశంలోని 12 రాష్ట్రాల విశ్వకర్మ సమాజానికి సేవ చేసిన వారిని విశ్వకర్మ లీడర్స్ గా గుర్తించి అవార్డ్స్ ఇవ్వడం జరిగింది. అవార్డు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, నాగర్ కర్నూల్ ప్రస్తుత ఎంపీ మల్లు రవి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, తెలంగాణ తొలి శాసన సభ స్పీకర్ సిరికొండ మధుసూదన చారి, సెంట్రల్ మాజీ బీసీ కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి, తెలంగాణ బీసీ సంఘాల అధ్యక్షులు కుందరం గణేష్ చారి, తెలంగాణ మనుమయ సంఘం అధ్యక్షులు కృష్ణమ చారి, విశ్వ కర్మ నాలెడ్జ్ సెంటర్ న్యూ ఢిల్లీ చీఫ్ ఫౌండర్ నీలందుల పుష్పగిరి చేతుల మీదుగా మూడుచింతలపల్లి మండల విశ్వకర్మ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు, వర్ణోజీ బాలకృష్ణ (కొల్తురు గ్రామవాసి)కి విశ్వకర్మ సమాజానికి ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు గానూ విశ్వకర్మ లీడర్ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర విశ్వకర్మ సంఘం కార్యదర్శి ముత్యాల లక్ష్మణ్ చారి, మేడ్చల్ జిల్లా విశ్వకర్మ అధ్యక్షుడు భాషపల్లి రమేష్ చారి, మూడుచింతలపల్లి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ మహంకాళి ఆంజనేయులు చారి, సంఘం ప్రధాన కార్యదర్శి రాములు చారి పాల్గొన్నారు.


# విద్యుత్ చౌర్యానికి పాల్పడొద్దు

ప్రజానావ, నార్సింగి:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గృహ జ్యోతి పథకంలో భాగంగా రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందని, వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడొద్దని విద్యుత్ శాఖ నార్సింగి ఉపకేంద్రం ఆపరేషనల్ ఏఈ స్వామి అన్నారు. రామాయంపేట డివిజన్ పరిధిలోని నాలుగు ఉప కేంద్రాలైన రామాయంపేట, నిజాంపేట్, చేగుంట, నార్సింగిలలో ప్రతి నెల ఒక డివిజన్‌లో విశేష సమావేశం నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా గురువారం నార్సింగి ఉప కేంద్ర పరిధిలో విశేష సమావేశం నిర్వహించామన్నారు. విశేష సమావేశంలో భాగంగా ఉప కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలలో విద్యుత్ మీటర్ల తనిఖీ చేస్తామన్నారు. తనిఖీ కార్యక్రమంలో రామాయంపేట డివిజన్ విద్యుత్ శాఖ ఏడీ, తొమ్మిది ఏఈలు, డీపీఏ విభాగం, ఏపీటీఎస్ విభాగం వారు పాల్గొంటున్నారన్నారు. విశేష తనిఖీలో భాగంగా ఇంటింటికి వెళ్లి విద్యుత్ మీటర్లను పరీక్షించి అందులో విద్యుత్ చౌర్యం కోసం ఏమైనా చేయడం జరిగిందా, మీటర్ సరిగ్గా పని చేస్తుందా, ఏమైనా సమస్య ఉందా అన్న విషయాల గమనిస్తామన్నారు. ప్రభుత్వం గృహ జ్యోతి పథకంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నందున వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడకూడదని, విద్యుత్‌ను సక్రమంగా వాడుకుని గృహ జ్యోతితో లబ్ధి పొందాలన్నారు. మీటర్లు లేని వారు బ్యాంక్‌లో రూ.1650 డీడీ చెల్లించి, రామాయంపేటలోని కస్టమర్ సర్వీస్ పాయింట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, తాము వారం రోజుల్లో మీటర్ బిగిస్తామని, విద్యుత్ కనెక్షన్‌ను సక్రమం చేసుకోవాలని సూచించారు. ఒక వేళ వినియోగదారులు చౌర్యానికి పాల్పడితే వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే కొంత మంది రైతులు పొలాల వద్ద ఫెన్సింగ్‌కు కరెంట్ షాక్ ఏర్పాటు చేస్తున్నారని, దాని వల్ల మూగ జీవాలు, మనుషులు ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రాణం విలువైనదని, పోతే తిరిగి రాదని, వెంటనే వాటిని తొలగించాలని కోరారు. విద్యుత్ శాఖ విద్యుత్ వాడకానికి సరఫరా చేస్తుందని, షాక్ ఏర్పాటు చేసుకోవడానికి కాదని, తొలగించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..




# యాపిల్ ఫేస్ ప్యాక్ తో అందం రెట్టింపు

పోషకాలు అధికంగా ఉండే యాపపిల్ తింటే ఆరోగ్యానికి ఎంత మంచిదో మనందరికి తెలుసు. కానీ చర్మ సౌందర్యానికి కూడా యాపిల్ అద్భుతంగా పనిచేస్తుందన్న సంగతి మీకు తెలుసా? అవును యాపిల్ చర్మ సౌందర్యాన్ని పెంచే అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మీ అందాన్ని రెట్టింపు చేసే అవసరమైన విటమిన్లు, పోషకాలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. యాపిల్‌లో విటమిన్ సి, విటమిన్ ఎ, జింక్, కాపర్ వంటి గుణాలు పుష్కలంగా లభిస్తాయి. యాపిల్ వృద్ధాప్య సమస్యల నుండి దూరం చేస్తాయి. మీ చర్మం పొడిబారకుండా చేస్తుంది. ముడతలు తగ్గిస్తాయి. ముఖం కాంతి వంతంగా మారుతుంది. యాపిల్‌తో ఫేస్ ప్యాక్ వేసుకోవడం ద్వారా చర్మం మృదువుగా తయారవుతుంది. ఇంకెందుకు ఆలస్యం మీరు కూడా ఓసారి యాపిల్‌తో ఈ ఫేస్ ప్యాక్‌లు ట్రై చేయండి.



### గ్లోయింగ్ స్కిన్ కోసం యాపిల్, పెరుగు , నిమ్మకాయ ఫేస్ ప్యాక్

ఒక చిన్న యాపిల్‌ను మెత్తగా పేస్ట్ లాగా తయారు చేయండి. అందులో టీ స్పూన్ పెరుగు, నిమ్మకాయ కలపి వాటిని బాగా మిక్స్ చేయండి. ఆ తర్వాత ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల తర్వాత సాధారణ నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే ముఖంపై మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి. ముఖం కాంతి వంతంగా మెరుస్తుంది.

### రోజ్ వాటర్‌తో యాపిల్ ఫేస్ ప్యాక్

తక్షణ గ్లో కోసం యాపిల్, రోజ్ వాటర్ ఫేస్ ప్యాక్ ట్రై చెయ్యొచ్చు. యాపిల్‌లో యాంటీ ఆక్సీడెంట్లు, యాంటీ మైక్రోబియల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇందుకోసం యాపిల్ గుజ్జులో రెండు టేబుల్ స్పూన్ రోజ్ వాటర్ కలపి ముఖానికి అప్లై చేయండి. 1015 నిమిషాల తర్వాత ముఖాన్ని గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకుంటే తక్షణమే మీ స్కిన్ మెరిసేలా చేస్తుంది. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

### యాపిల్, తేనె ఫేస్ ప్యాక్

ఒక చిన్న యాపిల్ గుజ్జులో టీ స్పూన్ తేనె కలిపి ముఖానికి అప్లై చేయండి. ఆ తర్వాత ముఖాన్ని సాధారణ నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తే మీ స్కిన్ కాంతివంతంగా మెరుస్తుంది. ముఖంపై మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి.



### యాపిల్, అరటి, ఫేస్ ప్యాక్

ఒక చిన్న యాపిల్‌ను మొదట బాయిల్ చేయండి. అందులో ఒక చిన్న అరటి పండును తీసుకుని మెత్తగా పేస్ట్ లాగా తయారు చేయండి. ఈ మిశ్రమంలో టీ స్పూన్ తేనె కలిపి ముఖానికి అప్లై చేయండి. ఆ తర్వాత గోరువెచ్చటి నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి ఒకసారి చేస్తే ముఖంపై ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి. ముఖం కాంతివంతంగా మెరుస్తుంది.

### యాపిల్, పాలు, తేనె ఫేస్ మాస్క్

యాపిల్ గుజ్జులో రెండు టేబుల్ స్పూన్ పాలు, టీ స్పూన్ తేనె కలిపి ముఖానికి అప్లై చేయండి. అరగంట తర్వాత గోరువెచ్చటి నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే మీ స్కిన్ కాంతివంతంగా






# ఫ్రిడ్జ్‌లో ఈ ఫుడ్స్ అస్సలు పెట్టొద్దు

ఫ్రిడ్జ్‌లో ఎటువంటి పదార్థాలు పెట్టాలి? ఎటువంటి పదార్థాలు పెట్టొద్దు? ఈ విషయం మీద చాలా మందికి ఓ క్లారిటీ ఉండదు. అందుకే ఏది పడితే అది ఫ్రిడ్జ్‌లో పెడుతుంటారు. అయితే అసలు ఎటువంటి పదార్థాలు రిఫ్రిజిరేటర్ లో పెట్టాలి? ఎటువంటివి పెట్టొద్దు? వంటి విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం..

### బంగాళదుంపలు

సగం కట్ చేసిన బంగాళదుంపలు లేదా తాజాగా ఉన్నవాటిని అయిన ఫ్రిడ్జ్‌లో పెట్టకూడదు. ఇలా పెట్టడం వల్ల దుంపల్లోని పిండి చక్కెరగా మారుతుంది. ఇది ఆరోగ్యానికి అంత మంచిది కాదని వైద్య నిపుణులు అంటున్నారు.

### టమాటో

టమాటోలో కెరోటినాయిడ్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. దీనివల్ల ఫ్రిడ్జ్‌లో పెట్టిన టమాటోల రంగు మారుతుంది. ఇలా మారిన టమాటోలను తినడం ఆరోగ్యానికి మంచిది కాదు.

### ఉల్లిపాయ

ఫ్రిడ్జ్‌లో ఉల్లిపాయలు పెడితే తేమకి తడిగా మారుతాయి. దీంతో వండిన కూరలు రుచి తగ్గడంతో పాటు ఆరోగ్యానికి హానికరమని నిపుణులు చెబుతున్నారు.

### వెల్లుల్లి

వెల్లుల్లిని ఫ్రిడ్జ్‌లో పెట్టకూడదు. చల్లని ఉష్ణోగ్రత వల్ల తొందరగా చెడిపోతాయి. ఇలా పాడైన వెల్లుల్లిని తింటే ఆరోగ్యం క్షీణిస్తుంది.

### అరటిపండ్లు

ఫ్రిడ్జ్‌లో పెట్టిన అరటి పండ్లను తినడం వల్ల అనారోగ్య బారిన పడతారు. ఉష్ణోగ్రత వల్ల తొందరగా అరటిపండ్లు నల్లగా అయిపోతాయి. అరటిపండ్లు బయట ఉంచిన రెండు నుంచి మూడు రోజుల వరకు తాజాగా ఉంటాయి.




# కల్తీనూనెను ఎలా గుర్తించాలి?



**తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందన్న వార్తలు వచ్చినప్పటి నుంచి జనంలో అనేక అనుమానాలు కలుగుతున్నాయి. అసలు రోజూ వాడుకుంటున్న నూనె అసలైనదా? లేక కల్తీదా? ఇలా రకరకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తెలిసి చేసినా తెలియక చేసిన తప్ప తప్పే. దేవుడి ప్రసాదాన్నే కల్తీ చేసిన కేటుగాళ్లు.. మనం కొనుగోలు చేసే నూనెలను కల్తీ చేయకుండా ఉంటారా అనే సందేహం ప్రతి ఒక్కరినీ వెంటాడుతోంది.**

### జంతువుల కొవ్వే చీప్

ఈ రోజుల్లో ఏది అసలు.. ఏది నకిలీ అని గుర్తించడం కష్టమే. ఇప్పుడు మార్కెట్లో లభ్యమవుతున్న నెయ్యి, నూనెలను చెక్ చేసినా.. షాకింగ్ రిపోర్టులు రావచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందేందుకు కొన్ని సంస్థలు అడ్డదారులు తొక్కుతున్నాయి. చీప్‌గా వచ్చే జంతువుల కొవ్వులను నూనెల్లో కలుపుతున్నారు. అదేంటీ.. మార్కెట్లో, మటన్, బీఫ్‌లు అంతేసి ఖరీదు ఉంటాయి. అలాంటిది.. వాటి కళేబరాలతో తయారు చేసే నూనెలు కూడా అంతే ఖరీదు ఉండాలి కదా అని కొందరు లాజిక్కులు చెప్పినా నమ్మకండి. ఎందుకంటే.. ఆ నూనెల తయారీకి ఎక్కువ శాతం వాడేది బయట అనాథగా చచ్చిపోయే వివిధ జంతువుల మాంసాన్ని. నెయ్యి లేదా నూనెల్లో పంది కొవ్వు అవశేషాలు ఉన్నాయంటే.. తప్పకుండా అవి చనిపోయిన వాటి నుంచి తీసిందే కావచ్చు. ప్రత్యేకంగా వాటిని పెంచి, వధించి నూనెలు తయారు చేసే ఛాన్సే ఉండదు.

### ఎలా తయారు చేస్తారు?

చాలామంది జబ్బు పడిన లేదా ఒట్టిపోయిన (పాలు ఇవ్వలేని) ఆవులు, గేదెలను తక్కువ రేటుకు విక్రయిస్తుంటారు. మరికొందరు రోడ్డు ప్రమాదాలు, లేదా జబ్బులతో చనిపోయే జంతువుల కళేబరాలను సేకరిస్తుంటారు. వాటిని ఇలాంటి నూనెల తయారీ సంస్థలకు విక్రయిస్తారు. వారు ఆ కళేబరాలను ముక్కలుగా చేస్తారు. తర్వాత అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద వాటిని మరిగిస్తారు. ఆ వేడికి మాంసానికి ఉండే కొవ్వు మొత్తం నూనెలా తయారవుతుంది. దాన్ని ప్రత్యేక పాత్రల్లోకి తీసుకుని, శుద్ధి చేసి.. స్మెల్ రాకుండా రసాయనాలతో ప్రోసెస్ చేస్తారు. పూర్తిగా అవి నూనె తరహా రంగును పొందిన తర్వాత.. ప్యాకెట్లు, టిన్నుల్లో వేసి విక్రయిస్తారు. కొన్ని సంస్థలు బ్రాండెడ్ సంస్థల స్టిక్కర్లు వేసి మరీ విక్రయిస్తాయి. ఇలాంటి సంస్థలు దేశవ్యాప్తంగా చాలానే ఉన్నాయి. అయితే, ఇదంతా గుట్టుచప్పుడుగా సాగిపోయే ప్రక్రియ. అవన్నీ బయటకు సాధారణ నూనె కర్మాగారాలుగా కనిపిస్తాయి. కానీ లోపల జరిగేది మాత్రం ఇది.

### కల్తీ ఎలా గుర్తించాలి?

ఇలాంటి నకిలీలను గుర్తించడం కొంచెం కష్టమే. అయితే, ఆహార నిపుణులు తెలిసిన వివరాల ప్రకారం.. స్వచ్ఛమైన నూనెలను మరిగిస్తే పొంగు రాదు. జంతువుల కళేబరాలతో తయారు చేసిన నూనెలను మరిగిస్తే మాత్రం పొంగు వస్తుంది. అంతేకాదు.. దుర్వాసన కూడా వస్తుంది. ఒక వేళ మీరు కొనుగులు చేసిన నెయ్యి, నూనెల నుంచి స్వచ్ఛమైన వాసన రానట్లయితే.. తప్పకుండా అనుమానించాల్సిందే. ఇలాంటి కల్తీ నూనెలు వాడితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి జాగ్రత్త. నూనె, నెయ్యిలను చాలా రకాలుగా కల్తీ చేస్తుంటారు. ఒక వేళ మీరు వాడుతున్న నెయ్యి నాణ్యతను పరిశీలించాలి అనుకుంటే.. ఈ కింది లింక్ క్లిక్ చేసి మరిన్ని వివరాలు తెలుసుకోండి.




ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

# సిరీస్‌పై టీమిండియా కన్ను



**జోహెన్నస్‌బర్గ్:** సౌతాఫ్రికాతో శుక్రవారం జరిగే నాలుగో, చివరి టి20 మ్యాచ్‌కు టీమిండియా సమరోత్సాహంతో సిద్ధమైంది. ఉత్కంఠభరితంగా సాగిన మూడో టి20లో భారత్ 11 పరుగుల తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ గెలుపుతో భారత్ సిరీస్‌లో 21 ఆధిక్యంలో నిలిచింది. చివరి టి20లోనూ గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. ఆతిథ్య సౌతాఫ్రికాకు ఈ మ్యాచ్ చావోరేవోగా మారింది. సిరీస్‌ను సమం చేయాలంటే ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం తప్పించి మరో మార్గం లేదు. దీంతో ఎలాగైనా గెలవాల్సిన పరిస్థితి జట్టుకు నెలకొంది. కిందటి మ్యాచ్‌లో సౌతాఫ్రికా అసాధారణ ఆటను కనబరిచినా విజయం మాత్రం సాధించలేక పోయింది. టీమిండియా 219 పరుగుల భారీ స్కోరు సాధించినా గెలుపు కోసం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మార్కొ జాన్సన్, హెన్రిచ్ క్లాసెన్‌లు విధ్వంసక బ్యాటింగ్‌తో భారత బౌలర్లను హడలెత్తించారు.

**సంజు ఈసారైనా..**

తొలి టి20లో సెంచరీతో ఆకట్టుకున్న సంజు శాంసన్ వరుసగా రెండు మ్యాచుల్లోనూ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా సంజు తన బ్యాట్‌క పనిచెప్పాల్సిన అవసరం ఉంది. సంజు వైఫల్యం జట్టుకు ఇబ్బందిగా మారింది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే సత్తా కలిగిన సంజు రెండు మ్యాచుల్లోనూ డకౌట్‌గా వెనుదిరిగాడు. కానీ కీలకమైన ఈ మ్యాచ్‌లో ఎలాగైనా బ్యాట్‌ను ఝులిపించాలనే పట్టుదలతో ఉన్నాడు.

**జోరు సాగాలి..**

మరోవైపు యువ ఓపెనర్ అభిషేక్ శర్మ, హైదరాబాదీ యువ సంచలనం తిలక్ వర్మ కిందటి మ్యాచ్‌లో విధ్వంసక బ్యాటింగ్‌తో చెలరేగి పోయిన విషయం తెలిసిందే. ఇద్దరు సఫారీ బౌలర్లపై విరుచుకుపడి జట్టుకు భారీ స్కోరు అందించడంలో ముఖ్య భూమిక పోషించారు. ఈ మ్యాచ్‌లో కూడా జట్టు వీరిపై భారీ ఆశలు పెట్టుకుంది. ఇద్దరు తమ మార్క్ బ్యాటింగ్‌తో చెలరేగితే టీమిండియాకు ఈ మ్యాచ్‌లోనూ భారీ స్కోరు ఖాయం. తిలక్‌వర్మ మూడో టి20లో అజేయ శతకంతో చెలరేగి పోయాడు. విధ్వంసక బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న తిలక్ 56 బంతుల్లోనే అజేయంగా 107 పరుగులు సాధించాడు. అభిషేక్ 25 బంతుల్లోనే 50 పరుగులు చేశాడు. ఇద్దరు రెండో వికెట్ 8.2 ఓవర్లలోనే 107 పరుగులు జోడించారు. ఈసారి కూడా ఇలాంటి ఇన్నింగ్సే ఆడాలనే పట్టుదలతో ఉన్నారు. కాగా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఈ సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. అతని వైఫల్యం జట్టుకు ఇబ్బందిగా మారింది. కిందటి మ్యాచ్‌లో సూర్య ఒక పరుగు మాత్రమే చేశాడు. కానీ ఈసారి ఎలాగైనా భారీ ఇన్నింగ్స్ ఆడాలనే లక్ష్యంతో కనిపిస్తున్నాడు. హార్దిక్ పాండ్య, రింకు సింగ్ తదితరులు కూడా తమ స్థాయికి తగ్గ బ్యాటింగ్‌ను కనబరచడం లేదు. ఈసారి ఆ లోపాన్ని సరిదిద్దుకోవాలని భావిస్తున్నారు. బౌలింగ్‌లో కూడా భారత్ బలంగా ఉంది. అర్ష్‌దీప్, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్‌ల వంటి టి20 స్పెషలిస్ట్ బౌలర్లు జట్టులో ఉన్నారు. రెండు విభాగాల్లోనూ బలంగా ఉన్న టీమిండియా ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

**సవాల్ వంటిదే..**

ఇదిలావుంటే ఆతిథ్య సౌతాఫ్రికాకు ఈ మ్యాచ్ సవాల్ వంటిదేనని చెప్పాలి. మూడో టి20లో ఓటమి పాలు కావడంతో సఫారీ టీమ్ ఒత్తిడిలో కనిపిస్తోంది. సిరీస్‌ను సమం చేయాలంటే ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కిందటి మ్యాచ్‌లో ఓడడంతో సౌతాఫ్రికా సిరీస్‌లో 12 తేడాతో వెనుకబడి పోయింది. సిరీస్‌ను డ్రా చేయాలంటే ఆఖరి మ్యాచ్‌లో కచ్చితంగా గెలవాల్సిందే. రియాన్ రికెల్టన్, రీజా హెండ్రిక్స్, మార్క్రమ్, ట్రిస్టన్ స్టబ్స్, హెన్రిచ్ క్లాసెన్, డేవిడ్ మిల్లర్, మార్కొ జాన్సెన్, కొయెట్జి వంటి మ్యాచ్ విన్నర్లు జట్టులో ఉన్నారు. దీంతో సౌతాఫ్రికా కూడా విజయంపై కన్నేసింది.



# భారత్ హ్యాట్రిక్ విజయం

**రాజ్‌గిర్(బిహార్):** మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో ఆతిథ్య భారత జట్టు హ్యాట్రిక్ విజయం సాధించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 130 గోల్స్ తేడాతో థాయిలాండ్‌ను చిత్తు చేసింది. వరుసగా మూడు మ్యాచుల్లో గెలిచిన భారత్ సెమీస్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. పూర్తిగా ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ఆతిథ్య భారత్ ప్రత్యర్థి టీమ్‌పై గోల్స్ వర్షం కురిపించింది. ఆరంభం నుంచే వరుసగా గోల్స్‌తో థాయిలాండ్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. యువ స్ట్రయికర్ దీపిక అసాధారణ ఆటతో చెలరేగి పోయింది. ఏకంగా నాలుగు గోల్స్ సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఆట మూడో నిమిషంలోనే దీపిక భారత్‌కు తొలి గోల్ అందించింది. 9వ నిమిషంలో ప్రీతి దూబె, 12వ నిమిషంలో లాల్‌రెమ్‌సియామి గోల్స్ సాధించారు. దీపిక 19వ నిమిషంలో మరో గోల్ నమోదు చేసింది. 30వ నిమిషంలో డంగ్ డంగ్ కూడా గోల్ సాధించింది. ప్రథమార్ధం ముగిసే సమయానికి భారత్ 50 ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధంలో మరింత దూకుడును ప్రదర్శించింది. 40వ నిమిషంలో ప్రీతి దూబే తన రెండో గోల్‌ను నమోదు చేసింది. ఆ తర్వాత దీపిక వరుసగా మూడు గోల్స్ సాధించింది. రెండు నిమిషాల వ్యవధిలో దీపిక ఈ గోల్స్ సాధించడం కాగా, దీపిక ఐదు గోల్స్ సాధించగా, ప్రీతి,మనీషా, లాల్‌రెమ్‌సియామి తలో రెండు గోల్స్ చేశారు. డంగ్‌డంగ్, నవ్‌నీత్ కౌర్ ఒక్కో గోల్ సాధించారు. ప్రత్యర్థి టీమ్‌లో ఏ ఒక్కరూ కూడా గోల్స్ సాధించలేక పోయారు. ఇదిలావుంటే ఈ మ్యాచ్‌లో రికార్డు విజయం సాధించిన భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది.



# ఆస్ట్రేలియా గెలుపు

**బ్రిస్బేన్:** పాకిస్థాన్‌తో గురువారం జరిగిన తొలి టి20లో ఆస్ట్రేలియా 29 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం వల్ల మ్యాచ్‌ను ఏడు ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 7 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. గ్లెన్ మ్యాక్స్‌వెల్ విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగి పోయాడు. దూకుడుగా ఆడిన మ్యాక్స్‌వెల్ 19 బంతుల్లోనే ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో 43 పరుగులు చేశాడు. స్టోయినిస్ 7 బంతుల్లో అజేయంగా 21 పరుగులు సాధించాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 64 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఆరంభం నుంచే ఆస్ట్రేలియా బౌలర్లు అద్భుతంగా రాణించారు. వరుస క్రమంలో వికెట్లను తీస్తూ ఏ దశలోనూ పాకిస్థాన్‌కు కోలుకునే అవకాశం ఇవ్వలేదు. హసీబుల్లా (12), అబ్బాస్ అఫ్రిది 20 (నాటౌట్), షహీన్ అఫ్రిది (11) మాత్రమే రెండంకెల స్కోరును అదుకున్నారు. మిగతా వారు విఫలం కావడంతో పాక్‌కు ఓటమి తప్పలేదు.

## అలా అయితే ఆస్ట్రేలియా పర్యటనకు మహ్మద్ షమీ

**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ షమి దాదాపు ఏడాది తర్వాత మైదానంలోకి అడుగుపెట్టాడు. రంజీ ట్రోఫీలో బెంగాల్ తరఫున మధ్యప్రదేశ్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ మ్యాచ్‌లో ప్రదర్శన ద్వారా ఆస్ట్రేలియా)లో జరగనున్న బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో ఆడాలని చూస్తున్నాడు. మధ్యప్రదేశ్‌తో మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తున్నప్పుడు షమి మునుపటిలానే కనిపించాడు. ఏడాది తర్వాత క్రికెట్ ఆడుతున్నా.. ఎక్కడా ఇబ్బంది పడుతున్నట్లు కనిపించలేదు. తొలి ఇన్నింగ్స్‌లో నాణ్యమైన బౌలింగ్‌తో (4/54) అదరగొట్టాడు. మొదటి రోజు (బుధవారం) 10 ఓవర్లు వేసిన అతడు 34 పరుగులు ఇచ్చి ఒక్క వికెటూ తీయలేదు. కానీ, రెండో రోజు ఆటలో మాత్రం చెలరేగిపోయాడు. ఇవాళ కేవలం 9 ఓవర్లు మాత్రమే వేసిన షమి మరో 20 పరుగులు ఇచ్చి ఏకంగా నాలుగు వికెట్లను పడగొట్టాడు. ఈ క్రమంలోనే ఓ వార్త బయటికొచ్చింది. షమిని త్వరలో ఆస్ట్రేలియాకు పంపించాలని సెలక్షన్ కమిటీ భావిస్తోందట. కానీ, అందుకు రెండు షరతులు పెట్టిందట! రంజీ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్ సమయంలో షమి ఫిట్‌నెస్ ఎలా ఉంది? మ్యాచ్ ముగిసే సమయానికి ఏదైనా వాపు లేదా నొప్పి ఉందా? అనే విషయాలను సెలక్షన్ కమిటీ పర్యవేక్షించనున్నట్లు తెలుస్తోంది. ఈ రెండింటిలో షమి పాసైతే తొలి టెస్టుకు ముందే ఆస్ట్రేలియాకు పయనమై జట్టుతో కలిసే అవకాశముందని బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒకవేళ అతను ఆస్ట్రేలియాకు వెళితే ప్రైమ్ మినిస్టర్స్ XIతో రెండు రోజుల డే/నైట్ ప్రాక్టీస్ మ్యాచ్ ఆడతాడు. షమి బౌలింగ్ ఎలా చేస్తున్నాడనే విషయాన్ని తెలుసుకునేందుకు సెలక్షన్ కమిటీ సభ్యుడు అజయ్ రాత్రా, ఎన్‌సీఏ మెడికల్ టీమ్ హెడ్ నితిన్ పటేల్‌ను ఇండోర్‌కు పంపారు. వీరు ఇచ్చే ఫీడ్ బ్యాక్‌ను బట్టి చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, కెప్టెన్ రోహిత్ శర్మ, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ షమి విషయంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. నవంబర్ 22 నుంచి బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్ ప్రారంభం కానుంది.



# సూర్యకు చెప్పి మరీ..



**సెంచూరియన్:** మైదానంలో సత్తాచాటుతానని కెప్టెన్ సూర్యకుమార్‌కు చెప్పి మరీ.. దక్షిణాఫ్రికాతో మూడో టీ20లో హైదరాబాద్ కుర్రాడు తిలక్ వర్మ అజేయ సెంచరీ సాధించడం విశేషం. శతకం తర్వాత డగౌట్ వైపు అతను గాల్లోకి ముద్దులు విసిరాడు. ఆ ముద్దులు ఎవరికో కాదు.. సూర్యకే. ఈ మ్యాచ్‌లో మూడో స్థానంలో ఆడతానని తిలక్ అడగ్గానే ఒప్పుకున్న సూర్య తన స్థానాన్ని త్యాగం చేసి నాలుగులో బ్యాటింగ్‌కు వచ్చాడు. సారథి నమ్మకాన్ని నిలబెడతానని చెప్పిన తిలక్ తొలి అంతర్జాతీయ సెంచరీతో అదరగొట్టాడు. ఈ సిరీస్‌లో తొలి రెండు టీ20ల్లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేసిన తిలక్ వరుసగా 33, 20 పరుగులు చేశాడు. ‘‘గెబెహాలో నా గదికి వచ్చిన తిలక్ మూడో స్థానంలో ఆడే అవకాశం ఇవ్వమని కోరాడు. తను సత్తా చాటుతానని చెప్పాడు’’ అని సూర్య వెల్లడించాడు. తిలక్ కూడా ఇదే విషయం చెప్పాడు. ‘‘అది (గాల్లో ముద్దులు) మా కెప్టెన్ స్కై (సూర్యకుమార్) కోసమే. ఎందుకంటే అతను మూడో స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశమిచ్చాడు. ఈ స్థానంలో బ్యాటింగ్‌ను ఇష్టపడతా. గత రెండు మ్యాచ్‌ల్లో నాలుగులో ఆడా. నా విజ్ఞప్తిని మన్నించిన సూర్య.. మ్యాచ్‌కు ముందు రాత్రి నా గదికి వచ్చి మూడో స్థానంలో బ్యాటింగ్ చేయమని చెప్పాడు. అదో మంచి అవకాశమన్నాడు. అప్పుడే ‘నాకో అవకాశమిచ్చావు. మైదానంలో నేనేంటో చూపిస్తా’ అని చెప్పా. మేం విఫలమైనప్పుడూ జట్టు మద్దతుగానే నిలిచింది. భారత క్రికెట్ జట్టు ఆట శైలిని కొనసాగించాలని మేనేజ్‌మెంట్ చెప్పింది. వికెట్ కోల్పోయినా సరే కానీ స్వేచ్ఛగా ఆడాలని తెలిపింది’’ అని తిలక్ పేర్కొన్నాడు. గతేడాది అంతర్జాతీయ కెరీర్ ఆరంభించిన 22 ఏళ్ల తిలక్ ఈ ఏడాది ఫామ్‌లేమి, గాయంతో కొన్ని నెలల పాటు జట్టుకు దూరమయ్యాడు. ‘‘గత ఐపీఎల్ (IPL 2024) చివరి మ్యాచ్‌లో చేతి వేలు స్థానభ్రంశం చెందింది. దీంతో రెండు నెలల పాటు ఆటకు దూరమయ్యా. ఆ తర్వాత నెట్స్‌లో ఆడేటప్పుడు మరో గాయమైంది. దీంతో జింబాబ్వే, శ్రీలంక సిరీస్‌లు ఆడలేకపోవడంతో నిరాశ కలిగింది. మంచి అవకాశాలు చేజారాయనుకున్నా. కానీ ఓపికతో ప్రక్రియపై దృష్టి పెట్టి కష్టపడ్డా. కెప్టెన్, మేనేజ్‌మెంట్ మద్దతుతో ఈ సారి రాణించా. నా స్పిన్ బౌలింగ్‌ను మెరుగుపర్చుకోవడం కోసమూ కృషి చేస్తున్నా’’ అని తిలక్ పేర్కొన్నాడు.

## బౌలరే కానీ బ్యాటింగ్‌లోనూ రికార్డులు..

# టెస్టులకు టిమ్ సౌథీ వీడ్కోలు!

**హామిల్టన్:** న్యూజిలాండ్ స్టార్ పేసర్, మాజీ కెప్టెన్ టిమ్ సౌథీ మరో కీలక నిర్ణయం తీసుకున్నాడు. భారత్‌తో టెస్టు సిరీస్‌కు ముందు తన సారథ్యానికి గుడ్‌బై చెప్పేసిన టిమ్.. తాజాగా టెస్టు ఫార్మాట్‌కే వీడ్కోలు పలికేందుకు సిద్ధమయ్యాడు. ఇంగ్లండ్‌తో (న్యూజిలాండ్, ఇంగ్లాండ్) స్వదేశంలో జరగనున్న సిరీసే చివరిదని టిమ్ వెల్లడించాడు. హామిల్టన్ వేదికగా ఇంగ్లండ్‌తో మూడో టెస్టు జరగనుంది. అక్కడే తన ఆఖరి మ్యాచ్‌ను టిమ్ ఆడనున్నాడు. కివీస్ తరఫున 104 టెస్టులు ఆడిన సౌథీ 2,185 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో 385 వికెట్లు పడగొట్టాడు. 161 వన్డేల్లో 742 పరుగులు, 221 వికెట్లు తీశాడు. అంతర్జాతీయంగా 125 టీ20లు ఆడిన సౌథీ 303 పరుగులు, 164 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లోనూ 54 మ్యాచుల్లో 120 పరుగులు, 47 వికెట్లు తీశాడు.

‘‘న్యూజిలాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం ఎప్పటికీ గౌరవమే. చిన్నప్పటి నుంచి అదే కలతో పెరుగుతూ వచ్చా. సాకారం చేసుకోగలిగా. నా హృదయంలో టెస్టు క్రికెట్‌కు ప్రత్యేకమైన స్థానం ఉంది. నా టెస్టు కెరీర్ ప్రారంభమైన జట్టుపైనే చివరి మ్యాచ్ ఆడబోతుండటం ఆసక్తికరం. మూడు స్టేడియాలు నాకెంతో స్పెషల్. అందులో హామిల్టన్ మైదానంలో నా చివరి మ్యాచ్ ఆడాలని అనుకుంటున్నా’’ అని సౌథీ వెల్లడించాడు.

**రికార్డులు ఇవీ..**

టిమ్ సౌథీ బౌలర్‌గానే కాకుండా.. బ్యాటింగ్‌లోనూ కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. టెస్టుల్లో అత్యంత వేగంగా 2000+ పరుగులు (బంతులపరంగా) చేసిన రెండో బ్యాటర్ సౌథీ. ఇంగ్లండ్ బ్యాటర్ డకెట్ (2,293 బంతులు) ఈ ఘనతను సాధించకముందు వరకు సౌథీదే (2,418 బంతులు) అగ్రస్థానం.టెస్టుల్లో అత్యధిక సిక్స్‌లు బాదిన ఆరో ఆటగాడు సౌథీ. ఇప్పటి వరకు అతడు మొత్తం 93 సిక్సర్లు కొట్టాడు. అతడు అత్యధిక వ్యక్తిగత స్కోరు 77నాటౌట్.న్యూజిలాండ్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్ సౌథీ. టెస్టుల్లో అతడు 385 వికెట్లు పడగొట్టాడు. రిచర్డ్ హ్యాడ్లీ (431) తర్వాత సౌథీ ఉన్నాడు. ఇంగ్లండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో ఆడనున్న సౌథీ 400+ వికెట్ల క్లబ్‌లోకి చేరే అవకాశం మాత్రమే ఉంది.ఇటీవల భారత్‌తో టెస్టు మ్యాచ్‌లో అర్ధశతకం సాధించిన టిమ్ ఓ అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకొన్నాడు. తొమ్మిది లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్‌కు వచ్చిన బ్యాటర్ ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ కంటే ఎక్కువ పరుగులు చేయడం రెండోసారి మాత్రమే సాధ్యమైంది. భారత్ 46 పరుగులకు ఆలౌట్ కాగా.. టిమ్ 65 రన్స్ చేశాడు. గతంలో ఇంగ్లండ్‌పై ఆసీస్ ఆటగాడు రెగ్గీ డఫ్ సెంచరీ సాధించాడు. అప్పుడు ఇంగ్లండ్ స్కోరు 61 మాత్రమే.








## ఫిఫా ఫుట్ బాల్ మ్యాచ్ పోస్టర్ ఆవిష్కరించిన సీఎం రేవంత్

**ప్రజానావ, హైదరాబాద్:** ఈనెల 18న గచ్చిబౌలి స్టేడియంలో ఇండియా, మలేషియా జట్ల మధ్య జరిగే ఫిఫా ఇంటర్నేషనల్ ఫ్రెండ్లీ మ్యాచ్ పోస్టర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, డా.కేశవరావు, శ్రీనివాసరాజు, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి(క్రీడలు) జయేష్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు.




# ఆస్కార్ ప్రచారంలో జోరు పెంచిన 'లాపతా లేడీస్'

కిరణ్‌రావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లాపతా లేడీస్'. మనదేశం నుంచి ఆస్కార్‌కు అధికారికంగా ఎంపిక కావడంతో ప్రచారం జోరు పెంచింది. '

ఆస్కార్' క్యాంపెయిన్‌లో భాగంగా వరుస స్క్రీనింగ్‌లను ప్రదర్శిస్తోంది. తాజాగా హాలీవుడ్ మీడియాకు కిరణ్‌రావు, ఆమిర్‌ఖాన్ ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ సినిమా గురించి కొన్ని విషయాలు పంచుకున్నారు. ఈ కథ తన మనసును హత్తుకుందని దర్శకురాలు కిరణ్‌రావు అన్నారు. మహిళల స్వేచ్ఛ, ఆర్థిక స్వాతంత్ర్యం, భవిష్యత్తుపై నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం గురించి మాట్లాడగల శక్తి ఉన్న కథలా అనిపించిందన్నారు.

ఇక ఆమిర్ దీని గురించి మాట్లాడుతూ.. 'నేను ఈ స్టోరీని వినగానే ఇష్టపడ్డాను. వినోదాత్మకంగా అనిపించింది. అలాగే ఎన్నో ముఖ్యమైన విషయాలూ ఉన్నాయి. గొప్ప సినిమా అని భావించా.

భిన్నమైన కోణాలు ఇందులో ఉన్నాయనిపించింది. దీని చిత్రీకరణ సమయంలోనూ అందరూ కలిసి వర్క్ చేశారు. అన్నిటికంటే గొప్ప విషయం ఏంటంటే మహిళలకు పురుషులు సాయం చేశారు. ఎంతోమంది కృషి వల్ల ఈ చిత్రం ఇంత గొప్ప విజయాన్ని సొంతం చేసుకుంది.

ఈ సినిమాకు నిర్మాతగా ఉన్నందుకు ఆనందంగా ఉంది' అని ఆమిర్ ఖాన్ అన్నారు. 'మా చిత్రానికి అన్ని ప్రాంతాల నుంచి మద్దతు వస్తుందని ఆశిస్తున్నాను. మహిళలంతా దీనికి సపోర్ట్ చేస్తారనుకుంటున్నా. గొప్ప సందేశాత్మక చిత్రం కాబట్టి ఆస్కార్ వస్తుందని నమ్ముతున్నా' అని కిరణ్‌రావు తెలిపారు.

# ప్రభాస్..ఆరడుగుల బంగారం: అల్లు అర్జున్



బాలకృష్ణ వ్యాఖ్యాతగా ఆహా వేదికగా స్ట్రీమింగ్ అవుతోన్న సెలబ్రిటీ టాక్ షో 'అన్‌స్టాపబుల్' . 'పుష్ప ది రూల్' ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఈ కార్యక్రమంలో నటుడు అల్లు అర్జున్ సందడి చేశారు. చిరంజీవి, పవన్‌కల్యాణ్, ప్రభాస్, మహేశ్ బాబుల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దీనికి సంబంధించిన ఓ స్పెషల్ వీడియోను ఓటీటీ సంస్థ తాజాగా విడుదల చేసింది. ఇందులో ఆయన ప్రభాస్ గురించి మాట్లాడుతూ కనిపించారు. ''అప్పటికి, ఇప్పటికి ప్రభాస్‌ని చూస్తే ఒక్కటే మాట చెప్పాలని ఉంటుంది. ఆరడుగుల బంగారం'' అని అన్నారు. పవన్ కల్యాణ్ గురించి బాలకృష్ణ మాట్లాడుతూ.. ''తన దారిలో తను వెళ్లిపోతారు'' అనగా.. బన్నీ అంతే అంటూ బదులిచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది.

# థియేటర్లలో 'దేవర' హాఫ్ సెంచరీ.. ఎన్ని కేంద్రాల్లో అంటే?




ఇటీవల చాలా సినిమాలు కొన్ని వారాలకే 'తెర'మరుగవుతున్నాయి. కొన్ని పెద్ద సినిమాలు తక్కువ రోజుల్లోనే అత్యధిక వసూళ్లు రాబట్టి వెళ్లిపోతున్నాయి. ఫలానా సినిమా 100 రోజులు, 50 రోజులు ఆడిందన్న మాట వినిపించడమే లేదు. ఆ ఫీట్ సాధించిన లేటెస్ట్ మూవీ 'దేవర'. 52 కేంద్రాల్లో ఈ సినిమా 50 రోజులు ప్రదర్శితమైందని తెలియజేస్తూ టీమ్ పోస్టర్ రిలీజ్ చేసింది. 'ఎన్ని రోజులు? ఎన్ని సెంటర్లు? అని సినిమా విజయాన్ని చెప్పుకొనే నాటి రోజులను 'దేవర' గుర్తుచేసింది' అని పేర్కొంది.

ఓటీటీలో అందుబాటులో ఉన్నా థియేటర్లలో హాఫ్ సెంచరీ చేయడం విశేషం. సెప్టెంబరు 27న బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ సినిమా ప్రస్తుతం 'నెట్‌ఫ్లిక్స్' లో స్ట్రీమింగ్ అవుతోంది. రెండు విభిన్న పాత్రల్లో ఎన్టీఆర్ నటన, సినిమాటోగ్రఫీ, నేపథ్య సంగీతం ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. తంగం పాత్రలో జాన్వీ కపూర్ కట్టుకుంది. ఈ సినిమా విడుదలకు ముందే దర్శకుడు కొరటాల శివ పార్ట్ 2 ప్రకటించిన సంగతి తెలిసిందే

# అమెజాన్‌లో 'సిటడెల్: హనీ బన్నీ' హవా.. జాన్వీకపూర్ పోస్ట్‌కు స్పందించిన సమంత



సమంత, వరుణ్ ధావన్ నటించిన వెబ్ సిరీస్ 'సిటడెల్: హనీ బన్నీ'. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సిరీస్ మంచి ఆదరణను సొంతం చేసుకుంది. దీంతో విడుదలైన నాటి నుంచి అమెజాన్‌లో ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. తాజాగా ఈ సిరీస్ ఓ ఘనతను సొంతం చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది వీక్షించిన సిరీస్‌గా నిలిచింది.

రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన ఈ సిరీస్ ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లో ప్రసారమవుతోంది. భారత్‌తో పాటు అమెరికా, ఇటలీ, ఆస్ట్రేలియా, కెనడా, బ్రెజిల్‌తో సహా మొత్తం 150 దేశాల్లో 'సిటడెల్: హనీ బన్నీ' టాప్‌లో ఉంది. దీని గురించి దర్శకులు మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ పూర్తిచేయడం ఓ సవాలుగా అనిపించిందన్నారు. దీనికి ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభించడం ఆనందంగా ఉందని. దీనివెనక ఎంతోమంది కృషి ఉందని తెలిపారు.

ఇక ఈ సిరీస్ విడుదలైన నాటినుంచి సినీ ప్రముఖులు దీనిపై ప్రశంసలు కురిపిస్తూనే ఉన్నారు. తాజాగా బాలీవుడ్ నటి జాన్వీకపూర్ దీనిని ప్రశంసించారు. 'ప్రపంచవ్యాప్తంగా సిటడెల్ తుపాను ఏర్పడింది. దీనికి వస్తోన్న ఆదరణ చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. మీ కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది' అని అన్నారు. ఈ పోస్ట్‌ను సమంత షేర్ చేసి థ్యాంక్స్ చెప్పారు. మరోవైపు దీని పార్ట్2 కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రెండో భాగాన్ని సినిమాగా తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం ఇది చర్చల దశలో ఉంది. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 882/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2523, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. Editor: Adula Thirupathi. Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657